ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 22 మార్చి 2025

నూజివీడులో గంగానమ్మ విగ్రహం ధ్వంసం

» భక్తుల నిరసన.. పోలీసుల అదుపులో నిందితుడు


గంగానమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

నూజివీడు టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నూజివీడు కోవెల రోడ్‌లోని గంగానమ్మ రావి చెట్టు వద్ద ఉన్న గంగానమ్మ విగ్రహాన్ని గడ్డపలుగుతో తొలగించి పక్కన పడేయడంతో ఉద్రిక్తత నెలకొంది. దాదాపు 200 ఏళ్ల చరిత్ర గల గంగానమ్మ రావిచెట్టు వద్ద గంగానమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని స్థానికులు పూజలు జరుపుతున్నారు. ఈ క్రమంలో రావిచెట్టు పక్కనే ఉన్న స్థల యజమాని ఎడవల్లి కృష్ణ కుమారుడు రవిచంద్ర శుక్రవారం విగ్రహం ఉన్న స్థలం కూడా తమదేనంటూ గంగానమ్మ విగ్రహాన్ని గడ్డపలుగుతో తొలగించి పక్కన పడవేయడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పవిత్రంగా భావించే గంగానమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ స్థానికులు నిరసన ప్రదర్శన జరిపారు. నూజివీడు పట్టణ పోలీసులకు సమాచారమివ్వడంతో నిందితుడు రవిచంద్రను అదుపులోకి తీసుకున్నారు.

'పది' మూల్యాంకన సిబ్బంది సీనియార్టీ జాబితాలు విడుదల

ఏలూరు అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మూల్యాంకన విధులకు నియమించనున్న అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలను డీఈవో వెంకటలక్ష్మమ్మ శుక్రవారం విడుదల చేశారు. సీనియార్టీల్లో ఏమైనా అభ్యంతరాలుంటే సంబంధిత మండల విద్యాధికారికి తెలపాలని సూచించారు. ఈ అభ్యంతరాలను సోమవారం డీఈవో కార్యాలయానికి ఎంఈవోలు అందజేయా లన్నారు.

పంట నీటి కుంటలను సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్

ఏలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఐదువేల పంట కుంటలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రపంచ జలదినోత్సవం, పల్లె పండుగ కార్యక్రమంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో పంట కుంటల నిర్మాణం, సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణాలపై సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమం అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో ఐదు వేల పంట నీటి కుంటలు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,389 పనులను మంజూరు చేశామని, నిర్దేశించిన పంట నీటి కుంటల నిర్మాణాలను జూన్‌లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోకులాల కింద షెడ్డులు, సీసీ రోడ్డు ప్రభుత్వ లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకట సుబ్బారావు, జిల్లా వ్యవసాయశాఖ జేడీ షేక్ హబీబ్ బాషా, జడ్పీ సీఈవో భీమేశ్వరరావు, డీపీవో అనురాధ, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణమూర్తి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు అదుర్స్!



గత ఏడాది కంటే పెరిగిన లావాదేవీలు

» పట్టణ శివార్లలో క్రయవిక్రయాల జోరు
» జగన్ జమానాలో ఐదేళ్లు రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం అంతంత మాత్రమే
» గత ఏడాది రూ.263 కోట్లకు పైగా ఆర్జన
» ఈసారి ఇప్పటికే 72.18 శాతంతో దూసుకుపోతున్న రిజిస్ట్రేషన్ల ఆదాయం
» ఈ నెలాఖరు నాటికి రూ.350 కోట్లకు పైగా ఆదాయం చేరే అవకాశం

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కసారిగా రిజిస్ట్రేషన్లకు రెక్కలు తొడిగాయి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో భూముల అమ్మకాలు జరగకపోగా, బలవంతపు ఆక్రమణలు, రిజిస్ట్రేషన్ల దిశగానే అప్పటి వ్యవహారం సాగింది. అధికారులను ఏమార్చి, భయపెట్టి సమాంతరంగా యజమానులను లోబరచుకుని భూములు సొంతం చేసుకున్న ఘటనలు ఎన్నో. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యజమానులకు బంధనాలు వీడాయి. అప్పటికే క్రయ విక్రయాలకు సిద్ధంగా ఉన్న వారంతా రిజిస్ట్రేషన్ల దారి పట్టారు. ఈ మార్చి మాసాంతం మరికొద్ది రోజుల్లో ముగియనుండగానే గతేడాది కంటే రిజిస్ట్రేషన్ల సంఖ్య, ఆదాయం భారీగా పుంజుకుంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

జగన్ జమానాలో భూమి అమ్మాలన్నా, కొనాలన్నా అంతా తగువే. విలువైన భూములను ఏకపక్షంగా సొంతం చేసుకునేందుకు భుజబలం ప్రయోగించడంతోపాటు అధికార హంగు ప్రయోగించారు. తొమ్మిది నెలల క్రితం తెలుగుదేశం ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తరుణంలో భూవివాదాలన్నీ చల్లబడ్డాయి. సమాంతరంగా రిజిస్ట్రేషన్లు పుంజుకున్నాయి. అప్పట్లో రిజిస్ట్రేషన్లు నిమిత్తం అడ్వాన్సులు చెల్లించిన వారంతా ఒక్కసారిగా ముందుకు కదిలారు. కొనుగోళ్లు వైసీపీ ప్రభుత్వ హయాంలో దారుణంగా పడిపోయాయి. రియల్ ఎస్టేట్ మందగించింది. క్షేత్రస్థాయిలో వైసీపీకి చెందిన అనేక మంది కొనుగోళ్లు, అమ్మకాల్లో వివాదాలు సృష్టించడంలో కీలక పాత్ర వహించారు. దీంతో భూమి అమ్మాలన్నా, కొనాలన్నా ఇరువురికి ఇబ్బందిగానే మారింది. ఇలాంటి నేపథ్యం లోనే నెలల తరబడి క్రయ విక్రయాలన్నీ ముందుకే సాగలేదు. ఈ తరుణంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారం లోకి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రభావం రిజిస్ట్రేషన్లపై సంపూర్తిగా పడింది. గత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.380 కోట్ల 12 లక్షలు లక్ష్యం కాగా రూ.263 కోట్ల 50 లక్షల వరకు లావాదేవీలు జరిగాయి. గత మార్చి నాటికి రిజిస్ట్రేషన్లకు నిర్దేశిం చిన లక్ష్యంలో 69.32 శాతం లభించినట్టయ్యింది. అప్పట్లో 96,304 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి.

ఆరంభం నుంచే జోష్

ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచే భూముల లావాదేవీలు మరింతగా పుంజుకున్నాయి. గతంలో లేఅవుట్‌ల భూములకే స్థానికులు అధిక మొగ్గు ప్రదర్శించేవారు. కాని ఈసారి లేఅవుట్‌లతోపాటు వ్యవసాయ భూముల వైపు మళ్లడంతో భూముల కొనుగోళ్లు, అమ్మకాలు అన్ని మండలాల్లోను పెరిగాయి. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ వ్యవసాయ భూముల అమ్మకాలు, కొనుగోళ్ల మీదే అత్యధికంగా రిజిస్ట్రేషన్లు సాగినట్టు సమాచారం. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు తమ సొంత ప్రాంతాల్లో భూముల కొనుగోలుపై ఆసక్తి ప్రదర్శించారు.

ఈ ఏడాది మరింత దూకుడు

ఈ ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం లక్ష్యం రూ.440 కోట్ల 66 లక్షలు. ఈ దిశగా మొదటి నుంచి క్రయవిక్రయాలు, భూముల లావాదేవీలు జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నెలాఖరు నాటికి 83,080 రిజిస్ట్రేషన్లు జరగ్గా రూ.318 కోట్ల 10 లక్షలకు పైగా ఆదాయం లభించింది. గతేడాది 69.32 శాతం మేర ఆదాయం ఉండగా, ఇప్పుడది మార్చి నెల ముగియకముందే 72.18 శాతం నమోదు కావడం పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల శాఖలో మార్పులు, చేర్పులు జరగడం, రిజిస్ట్రేషన్లకు వచ్చే వారి పట్ల సానుకూలత ప్రదర్శించడం వంటి ధోరణులు కలిసొచ్చాయి. మార్చి మాసాంతం నాటికి 350 కోట్లకు పైబడి ఆదాయం వచ్చే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి.

భూమి విలువ భవిష్యత్తులో మరింత పెరగబోతుందనే సంకేతాలతో పట్టణ శివారుల్లో భూముల క్రయ విక్రయాలు భారీగా జరిగాయి. దీనికితోడు అమరావతి రాజధానికి ఊపిరి పోస్తూ తెలుగుదేశం ప్రభుత్వం వరుస చర్యలకు దిగడంతో జిల్లాలో రియల్ ఎస్టేట్‌కు కాస్త ఊపిరొచ్చింది. కొంతమంది జట్టుగా కలిసి పంట భూములను కొనుగోలు చేశారు. ప్రస్తుతానికి వీటిని లేఅవుట్‌లుగా మార్చకపోయినా మార్కెట్ అదును చూసి ముందడుగు వేయాలని భావిస్తున్నారు. అమరావతికి అత్యంత సమీపంలో ఏలూరు జిల్లా ఉండడంతో నూజివీడు, ఏలూరు, కైకలూరు వంటి నియోజకవర్గాలన్నింటిలోనూ భూముల ధరలు ఆరు నెలల క్రితమే పుంజుకున్నాయి. దీనికితోడు ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువలను సవరించింది. నగర, పట్టణాలకు చేరువగా ఉన్న భూముల ధరలను పెంచుతూ నోటిఫై చేసింది. ఏలూరు శివారులో గతంలో గజం 6,500 ఉండగా, దానిని రూ.7,500గా మార్చారు. కమర్షియల్ ప్రాంతాలన్నింటిలోనూ భూముల విలువలను సవరించకపోయినా లావాదేవీలన్నీ భారీగానే ఉంటున్నాయి. నూజివీడు మునిసిపల్ పరిధిలో ప్రధాన మార్గం వెంబడి గజం రూ.45 వేలు పైగానే పలుకుతుం డడం తాజా పరిస్థితికి అద్దం పడుతుంది. అప్పట్లో నూజివీడులోనే రాజధాని ఏర్పడుతుందన్న ప్రచారం సాగడంతో భూముల ధరలు ఆకాశన్నంటాయి. ఆ తర్వాత రియల్ భూమ్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఐదేళ్ల పాటు మళ్లీ రియల్ భూమ్ రానేరాలేదు. దీనికితోడు గత జగన్ ప్రభుత్వ హయాంలో లావాదేవీలన్నీ పడకేశాయి.

ఆపరేషన్ గరుడ

» మందుల షాపుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్ అధికారుల సంయుక్త దాడులు



7

ఏలూరు రేంజ్‌లో 31 మంది ఏఎస్‌ఐలకు పదోన్నతి

ప్రాణం తీసిన ఈత సరదా

కాల్వలో మునిగి ఇద్దరు బాలురు మృతి

7

బీసీ రుణాల జాతర

» జిల్లాకు 1,907 యూనిట్లు మంజూరు
» ఇప్పటి వరకు 8,070 దరఖాస్తులు
» నేటితో ముగియనున్న గడువు



ఏలూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రుణాల మంజూరుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈనెల మొదటివారంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవా లని ప్రకటిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు జిల్లాకు 1,907 యూనిట్లకు రుణాలు మంజూరుకు చర్యలు చేపట్టారు. అర్హులైనవారు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22తో గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో మీ-సేవ కేంద్రాల వద్ద దరఖాస్తుదారుల తాకిడి అధికంగా ఉంది. 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు వీటికి అర్హులు. బీసీ ఉప కులాలు, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ, కాపు కులాల వారికి చేయూత అందించి వారి స్వశక్తితో ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- బీసీలకు సంబంధించి స్వయం ఉపాధి పథకంలో భాగంగా యూనిట్ పెట్టుకునే వెసులుబాటుంది. అనుకూలమైన వ్యాపారాన్ని పెట్టుకోవచ్చు. రుణం రూ.రెండు లక్షలు ఉంటే అందులో రూ.75 వేల వరకు సబ్సిడీ ఉంటుంది. మూడు లక్షలైతే రూ.1.25 లక్షలు సబ్సిడీ, ఐదు లక్షలైతే రెండు లక్షల సబ్సిడీ ఉంటుంది. ఇప్పటివరకు ఈ పథకానికి సంబంధించి 5,682 దరఖాస్తులు వచ్చాయి. బీసీల్లో ఫార్మసీ చదివిన నిరుద్యోగులు ఉంటే వారికోసం జనరిక్ మెడిసిన్ పేరుతో రుణాలు అందిస్తున్నారు. మెడికల్ షాపు పెట్టుకోవచ్చు. ఎనిమిది లక్షల వరకు రుణం అందిస్తే అందులో నాలుగు లక్షలు సబ్సిడీ, నాలుగు లక్షల బ్యాంకు లోను చెల్లించాలి.
- మేదర, కుమ్మరి, శాలివాహన వారికి చేతి వృత్తుల ద్వారా ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఉపాధి పథకాలు అమలు చేస్తున్నారు. బుట్టల అల్లిక, కుండల తయారీదారులకు పథకం వర్తిస్తుంది. మూడు లక్షల వరకు రుణం అంది స్తారు. రూ. 1.50 లక్షలు సబ్సిడీ, ఈడబ్ల్యూఎస్ ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి ఆర్యవైశ్య, కమ్మ, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ, ఈబీసీకి చెందిన 307 కులాల వారికి స్వయం ఉపాధి పథకంలో భాగంగా యూనిట్ ధర 2 లక్షలు ఉంటే అందులో రూ.75 వేలు సబ్సిడీ ఉంటుంది.
- కాపు కులాల వారికి స్వయం ఉపాధికి సంబంధించి 1,753 దరఖాస్తులు వచ్చాయి. వీరు వ్యక్తిగతంగా రూ.రెండు, మూడు, ఐదు లక్షల చొప్పున యూనిట్ పెట్టుకోవచ్చు. 50 శాతం సబ్సిడీ ఉంటుంది. దీనికి 21 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయస్సు వారు అర్హులు. వీరిలోనే గ్రూపు ఎంఎస్ఎంఈ కాపు, బలిజ, తెలగ, ఒంటరి, ముగ్గురు నుంచి ఐదుగురు గ్రూపుగా ఏర్పడి 25 లక్షలు యూనిట్ ధరతో వ్యాపారం చేసుకోవచ్చు. పది లక్షలు సబ్సిడీ, పది లక్షలు బ్యాంకు లోను, రూ. లక్ష చొప్పున లబ్ధిదారు వాటాగా చేసుకోవాలి.
- పేదింటి మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ శిక్షణ ఇచ్చి ప్రభుత్వం ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టింది. దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులు. నియోజక వర్గానికి మూడువేలు చొప్పున మిషన్లు అందిస్తారు. గ్రామ, వార్డు సచివాల యాలు, మండలాలు, మునిసిపాలిటీల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.


బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో సబ్సిడీ రుణాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వివిధ వర్గాల నాయకులతో మాట్లాడుతున్న ఈడీ పుష్పలత

అర్హులంతా దరఖాస్తు చేసుకోవచ్చు ..

స్వయం ఉపాధి కోసం బీసీలు ఈడబ్ల్యూఎస్ వర్గాల వారిలో అర్హులంతా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటివరకు మొత్తం 8,070 దరఖాస్తులు అందాయి. ఇందులో ఈబీసీ 71, మేదర 44, రెడ్డి కార్పొరేషన్ 19, క్షత్రియ 28, కమ్మ 160, బ్రాహ్మణ 31, ఆర్యవైశ్యులు 282 దరఖాస్తులు అందాయి. ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో అర్హుల ఎంపిక జరుగుతుంది. ఎంపికైన వారికి బ్యాంకు లింకేజీతో సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తారు. తెలుపురంగు రేషన్‌కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే రుణ సదుపాయం లభిస్తుంది.

- పుష్పలత, బీసీ కార్పొరేషన్ ఈడీ


ఏలూరులో ఆధార్ నమోదు కేంద్రం వద్ద చిన్నారులు, తల్లిదండ్రులు

సాధ్యమేనా..?

» అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ నమోదు
» ఈనెల 24వ తేదీ వరకే గడువు
» ఇంకా 30 వేల మంది పెండింగ్
» స్థానిక ప్రజల్లో అవగాహనలేమి

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆధార్ సీడింగ్ చేయాల్సిందేనంటూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ వ్యహారంపై ప్రజల్లో అవగాహన కల్పించకపోవడంతో ఈ ప్రక్రియలో చిన్నారులందరికీ ఆధార్ నమోదు చేయించడం జరిగేనా ? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత నెలలోనే గ్రామ సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియను చేపట్టాలని మహిళా, శిశు సంక్షేమ శాఖను ఇందులో భాగస్వామ్యం చేశారు. అయినా ఆశించినంత పురోగతి లేకపోవడంతో ఈనెల 19 నుంచి 24లోగా ఆధార్ సీడింగ్ అందరికి చేయాల్సిందేనంటూ ఆదేశాలు అందాయి. ఈ వ్యవహారంలో చిన్నారుల ఆధార్ నమోదు కోసం తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా సాంకేతిక సమస్యలు, అవగాహన లేమితో ఆశించిన స్థాయిలో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్లలోపు పిల్లల నమోదు చేయించే బాధ్యతను ప్రభుత్వ సచివాలయాలు, మహిళా, శిశు సంక్షేమ శాఖలకు అప్పగించినా, ఇరుశాఖల మధ్య సమన్వయం లేదు. ఎక్కడ చేస్తుందీ తెలపకపోవడంతో సమస్యలు తప్పడం లేదు. జిల్లాలో 10 సీడీపీవో ప్రాజెక్టుల పరిధిలో 2,215 అంగన్‌వాడీ కేంద్రాల్లో లక్షా ఐదువేల 421 మంది చిన్నారులు రిజిస్టర్ అయి ఉన్నారు. ఇందులో కేవలం 75,414 మందికి ఆధార్ నమోదు జరగ్గా 30,007 మందికి ఆధార్ నమోదు చేయాల్సి ఉంది. నూజివీడులో అత్యధికంగా 4,868, చింతలపూడిలో 4,850, కైకలూరులో 3,159 మందికి చేయాల్సి ఉంది.

సమస్యలివే ఇవే..

నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నా ప్రచారం, పర్యవేక్షణ లేదు. కొన్ని చోట్ల సిబ్బంది ఉండడం లేదు. మరికొన్ని చోట్ల నెట్‌లో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. గంటల తరబడి పిల్లలతో కేంద్రాల్లో వేచి ఉండలేక తల్లిదండ్రులు వెనుదిరుగుతున్నారు. కొంత మంది చిన్నారులకు పుట్టిన తేదీ సర్టిఫికెట్లు లేకపోవడం సమస్యగా మారింది. వచ్చే ఏడాది స్కూల్స్ తెరిచేలోగా ఇతర స్కూల్స్‌లో చేరేందుకు ఆధార్ నమోదు తప్పనిసరి.

లక్ష్యాలను పూర్తి చేస్తాం..

అంగన్‌వాడీ ఆధార్ నమోదుపై జిల్లా ఐసీడీఎస్ పీడీ పి.శారద మాట్లా డుతూ 'అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో ఇప్పటికే ప్రజల్లో ప్రచారం చేయించాం. ఈ విషయంపై కేంద్రాల్లోను ఆరా తీస్తున్నాను. ఎట్టి పరిస్థితుల్లో లక్ష్యాలను పూర్తి చేసి తీరుతాం'అన్నారు.


మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ ప్రతాప శివకిశోర్

నేరాల అదుపునకు చర్యలు

ఎస్పీ ప్రతాప్ శివకిశోర్.. పెదపాడు పోలీస్‌స్టేషన్ తనిఖీ

పెదపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సమర్థవంతమైన చర్యలతో జిల్లాలో పూర్తిస్థాయిలో నేరాల అదుపునకు చర్యలు తీసుకున్నట్టు ఎస్పీ కె.ప్రతాప శివకిశోర్ తెలిపారు. పెదపాడు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, నేరాల సంఖ్య, నియంత్రణకు తీసుకుంటున్న భద్రతాపరమైన చర్యలు గురించి ఎస్సై కట్టా శారద సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. తొలుత మహిళా పోలీసులతో మాట్లాడి వృత్తిపరంగా ఎదురవుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగ నిర్వహణలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. జాతీయరహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి స్టేషన్ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పక్కనే వున్న సచివాలయ భవనాన్ని పరిశీలించారు. డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, స్టేషన్ రైటర్ సువర్ణరాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ జంటపై దాడిచేసిన హంతకులకు జీవితఖైదు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్, చిత్రంలో జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామారావు

ఏలూరు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక కేంద్రంగా పేరు పొందిన కామవరపుకోట మండలం జీలకర్రగూడెం బౌద్ధారామాలకు ఏటా కార్తీక మాసంలో పర్యాటకులు వెళ్తుంటారు. సాధారణంగా ఆదివారాల్లో, సెలవు రోజుల్లో స్నేహితులు, ప్రేమ జంటలు, కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్తుంటారు. ఇదేక్రమంలో భీమడోలు మండలానికి చెందిన నవీన్‌కుమార్ అనే డిగ్రీ విద్యార్థి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే ఒక విద్యార్థిని (17) ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరు 2019 ఫిబ్రవరి 24 ఉదయం 11 గంటలకు బౌద్ధా రామాలకు వెళ్లారు. అక్కడ నిర్మానుష్య ప్రదేశాలకు వారిద్దరూ వెళ్లగా అప్పటికే ఆ ప్రాంతాల్లో మాటువేసి ఉన్న నలుగురు ఆగంతకులు ఆ జంటపై దాడి చేసి ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేశారు. యువకుడిని చావబాదారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోను, నగదు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేయగా అప్పటి భీమడోలు సీఐ యు.జె.విల్సన్ కేసు నమోదు చేశారు. కృష్ణాజిల్లా జి.కొండూరు మండ లం మాధవరానికి చెందిన పోతునూరి రాజు అలియాస్ అంకమరావు (28), ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండ లం జి.కొత్తపల్లికి చెందిన తుపాకుల సోమయ్య (22), తుపాకుల గంగయ్య అలియాస్ గంగరాజు (20), కృష్ణాజిల్లా నందివాడ మండలం అరిసెలాల గ్రామానికి చెందిన కొమరగిరి నాగరాజు (22) (ప్రస్తుతం మైలవరం మండలం ముడిచెర్ల కృష్ణారంలో ఉంటున్నాడు) ఆ కొండ ప్రాంతంలో పక్షులు, జంతువులను వేటా డుతూ ఈ ఘాతుకానికి పాల్పడినట్టు గుర్తించి అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని పోక్సో కోర్టులో విచారణ సాగింది. హంతకులకు రెండు జీవిత ఖైదులు, ఒక్కొక్క సెక్షన్‌లో రూ.పది వేల జరిమానా విధిస్తూ జడ్జి ఉమాసునంద తీర్పు చెప్పారు. మృతురాలి తల్లిదండ్రులకు రూ.మూడు లక్షలు ఇవ్వాలని, గాయపడిన నవీన్‌కుమార్‌కు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవా లని ఆదేశాలు ఇచ్చారని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ శుక్రవారం రాత్రి ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎస్పీతో పాటు జిల్లా పబ్లిక్ ప్రాసి క్యూటర్ కోనే సీతారామ్, సీఐ విల్సన్, స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యాన్నీ కొంటాం

పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి

ఏలూరుసిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్‌లో మిగిలివున్న ధాన్యాన్ని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటునట్టు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం అయ్యాక వాటితో పాటు జిల్లాలో మిగిలివున్న ఖరీఫ్ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మొత్తం 3,50,843 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సీఎంఆర్ బియ్యాన్ని రైస్‌మిల్లు ద్వారా డెలివరీ చేసినట్టు తెలిపారు.







పెయింటింగ్స్ వేస్తున్న చిత్రకారుడు



కలెక్టరేట్ గోడలపై కళారూపాలు

ఏలూరు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని కుడి, ఎడమ వైపు రెండు గోడలపై కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి.. జానపద కళలు, పల్లె జీవన విధానం, వ్యవసాయం, గ్రామీణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేసిన పెయింటింగ్స్ అందరినీ ఆకర్షిస్తున్నాయి. సుందరీకరణలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పెయింటింగ్స్ వేశారు..

- ఫొటోగ్రాఫర్, ఏలూరు



ముగిసిన ఆల్ ఇండియా ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

భీమవరం అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వయసుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరు క్రీడలలో రాణించాలని తద్వారా ఆరోగ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతుందని కాస్మోపాలిటన్ క్లబ్ అధ్యక్షుడు అల్లూరి పద్మరాజు అన్నారు. వారం రోజులుగా భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో జరుగుతున్న వెర్టెక్స్ ఆల్ ఇండియ సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు 45+ సింగిల్స్ విభాగంలో ఎంవీఎల్ఎన్ రాజు, 55+ సింగిల్స్‌లో మణికంధన్‌లు విజేతలుగా నిలిచారు. వీరికి ట్రోఫీతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతిగా అందించారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ ప్రెసిడెంటు సుబ్బరాజు, ట్రెజరర్ వర్మ, సత్యనారయణమూర్తి, కెఆర్‌కెరాజు, వర్మ, టెన్నిస్ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎంపిక



బొల్లు రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు



కె.శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పెదవేగి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర ప్రదేశ్ కోకో రైతుల సంఘం కార్యవర్గం ఎంపిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. పెదవేగి మండలం విజయరాయిలో జరిగిన సమావేశంలో కోకో రైతుల సంఘం ఎంపిక జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఎస్.గోపాలకృష్ణ ఉపాధ్యక్షులుగా బోళ్ల సుబ్బారావు (పశ్చిమ గోదావరి), పానుగంటి అచ్యుత రామయ్య (ఏలూరు), ఉప్పుగంటి భాస్కరరావు (కోనసీమ), గుది బండి రమేష్‌రెడ్డి (ఏలూరు), మార్ని శ్రీనివాసరావు (తూర్పు గోదావరి) లను ఎన్నుకున్నారు. సహాయ కార్య దర్శులుగా ఉప్పల కాశీ (తూర్పు గోదావరి), కొసరాజు రాధా కృష్ణ (ఏలూరు), కొప్పిశెట్టి ఆనంద వెంకట ప్రసాద్ (కోనసీమ), కోశాధికారిగా జాస్తి కాశీబాబు (ఏలూరు)తో పాటు మరో 35 మందితో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో రైతుల సమస్యల పరిష్కారమే అజెండాగా సంఘం పని చేస్తుందన్నారు.రైతులు సంఘ టితమై పోరాటాలు చేస్తేనే తప్ప మనకు అందాల్సిన రాయితీలు, పథ కాలు వచ్చేలా లేవన్నారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న గింజల కొనుగోలు సమస్య విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని, పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు.. పాల్గొన్న ఉద్యోగులు

ఆర్టీసీ పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులు మార్చ్ నెలాఖరులోగా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేప డతామని ఏపీ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, అమరావతి జేఏసీ సెక్రటరీ పలిశెట్టి దామోదరరావు హెచ్చరించారు. యూనియన్ పశ్చిమగోదావరి జిల్లా రీజనల్ కౌన్సిల్ సమావేశం తాడేపల్లిగూడెంలోని ఓ ఫంక్షన్ హాలులో రీజనల్ అధ్యక్షుడు ఎన్‌వీ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. దామో దరరావు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆరేళ్ల గడిచినా ప్రభుత్వ ఉద్యో గులుగా సిబ్బందికి ప్రమోషన్‌లు ఇవ్వలేదని అది అమలుకాని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. దాదాపు 3 వేల మంది సిబ్బంది ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు 11వ పీఆర్‌సీకి సంబంధించి 24 నెలల బకా యిలు చెల్లించాలని, ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీ మేరకు 12వ పీఆర్‌సీని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఏఐటీ యూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఇఫ్టూ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు ఎస్‌వీ రావు, స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీఏ ఆలి తదితరులు మాట్లాడారు. అనంతరం తాడేపల్లిగూడెం ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యాలయ నిర్మాణం కోసం దామోదరరావు శంకుస్థాపన చేశారు.

విద్యుత్ లేదు.. పరీక్షలకు ఎలా చదువుకోవాలి ?

ఫేస్‌బుక్‌లో వీడియో పోస్ట్ చేసిన ఆకివీడు విద్యార్థినులు



ఆకివీడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) :విద్యుత్ లేకపోవడంతో చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వీడియో తీసి ఫేస్‌బుక్‌లో పెట్టిన సంఘటనపై అధికారులు విచారణకు దిగారు. ఆకివీడు అమృతరావునగర్ కాలనీలో శ్మశాన భూమిని ఆక్రమించి సుమారు 60 కుటుంబానివశిస్తున్నాయి. అయితే ఇటీవల అధికారులు ఆ ఇళ్లను తొలగించారు. వీరికి తాళ్ళకోడులో స్థలాలు ఇచ్చారు. అయితే నాలుగైదు కుటుంబాలు ఇళ్ల తొలగించిన ప్రాంతంలో గుడారాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. అందులో ఉంటున్న పదో తరగతి విద్యార్థినులు కొందరు కరెంటు లేకపోవడంతో చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని వీడియో తీసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. శుక్రవారం విద్యుత్ ఏఈ ప్రదీప్, తహసీల్దార్ నందూరి వెంకటేశ్వర రావు, ఎంఈవో సీతారామయ్య వెళ్ళి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇద్దరు బాలికలకు మాత్రమే కరెంటు సౌకర్యం లేదని గుర్తించారు. వీరికి సమీపంలోని ఐసీడీఎస్ కార్యాలయం దగ్గర చదువుకోవడానికి అవకాశం కల్పించామని ఎంఈవో తెలిపారు. మిగిలిన విద్యార్థులు కాలనీ సమీపంలో అద్దెకు ఉంటున్నారని వివరించారు. ఆక్రమణదారులు గుడారాలకు విద్యుత్ సరఫరా తెచ్చుకొనేందుకు ఇలాంటి చర్యలకు దిగుతున్నారని అధికారులు చెపుతున్నారు.

పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందికి ఉగాది పురస్కారాలు

ఏలూరు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్‌శాఖ, అగ్నిమాపక శాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది అత్యంత ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం 2025 ఉగాది పురస్కారాలను శుక్రవారం ప్రకటించింది. ఉత్తమ సేవా పతకాన్ని ఏలూరు డీసీఆర్బీలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ముడిలి శ్రీనివాస్, జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ పంపన నాగులకు ప్రకటించారు. నూజివీడు రూరల్ సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ, నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, జిల్లా ఆర్మ్డు రిజర్వు విభాగంలో పనిచేస్తున్న భావన కుమార్, దెందులూరు హెడ్ కానిస్టేబుల్ నందిగం సత్యనారాయణలకు ప్రకటించారు. అగ్నిమాపక శాఖ కైకలూరు లీడింగ్ ఫైర్‌మెన్ శ్రీనివాసరావు, నూజివీడు ఫైర్‌స్టేషన్‌లోని డ్రైవర్ కం ఆపరేటర్ ఆర్ఎన్ సురేష్‌బాబులకు సేవా పతకాన్ని ప్రభుత్వం ప్రకటించింది.

తాగునీరు సురక్షితమేనా ?



కలుషిత జలాలే దిక్కు

మానవ తప్పిదాలే కారణం

జల కాలుష్యం వల్లే రోగాలు

ప్రతీ ముగ్గురిలో ఒకరికి కలుషిత నీరు

నేడు ప్రపంచ జల దినోత్సవం

పాలకొల్లు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : భూ మండలంపై 71 శాతం నీరు ఆవిరించి ఉంది.ఇందులో 96.5 శాతం సముద్రపు నీరే..అందుబాటులో ఉన్న మంచినీరు 2.5 శాతం..ఇందులో భూమి ఉపరితలంపై ఉన్న నీరు కేవలం 1.2 శాతం...అంటే మనకు ఉన్న నీటిలో ఒక శాతం మాత్రమే భూమిపై ఉన్న జీవరాశులకి ఉపయోగపడుతున్నాయి. జీవపరిణామం ప్రారంభమైందే సముద్ర గర్భంలో అయితే ఇప్పుడు అభివృద్ధి పేరిట నీటిని కలుషితం చేస్తున్నాం. సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు జరిగినా ఆశ్చర్యం లేదు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఐక్యరాజ్య సమితి ప్రపంచ జల దినోత్సవం ప్రతీ ఏటా మార్చి 22వ తేదీన నిర్వ హించడానికి రూపకల్పన చేసింది. భూ గర్భ జాలాలను పెంచడం, రక్షిత నీటి సక్రమంగా వినియోగించడం, దుర్వినియాగాన్ని అరికట్టడం. వాటర్ డే ప్రధాన లక్ష్యం.

60 శాతం వ్యాధులకు కారణం కలుషిత నీరే

పాత పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 40 లక్షల మంది జనాభా ఉండగా మూడింతల ఒకంతు కలుషిత నీటినే తాగుతున్నారు. సంపన్న శ్రేణులు, మధ్య తరగతి ప్రజలు మినరల్, రక్షిత జలాలను వినియోగిస్తుండగా సామాన్య పేద వర్గాలు శుద్ధి చేయని జలాలనే తాగునీరుగా ఉపయోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ వందల సంఖ్యలో డయేరియా కేసులు వస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యుహెచ్‌వో సర్వే ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాలలో 60 శాతం వ్యాధులు కలుషిత తాగునీటి వలనే అని తేలింది.

మినరల్ వాటర్‌తో ప్రమాదాలు

అందంగా ప్యాక్ చేసిన మినరల్ వాటర్ బాటిళ్లను ఎగబడి కొనుగోలు చేసి తాగేస్తున్నారు.అయితే మినరల్ వాటర్‌తో ప్రమాదాలు ఉన్నాయని వైద్య వర్గాలు హెచ్చరిస్తున్నాయి. కార్బోనేటెడ్ మినరల్ వాటర్‌లో కార్బోనిక్ ఆమ్లం ఉండటం వల్ల ఎక్కిళ్లు, పొట్ట ఉబ్బరం కలిగిస్తుంది. కార్బోనేటెడ్ నీరు సాధారణ నీరు కంటే తక్కువ పీహెచ్ కలిగి ఉంటుంది. మినరల్ వాటర్ అధికంగా తాగితే దంతాలపై ఎనామిల్‌ను కరిగించేస్తుంది. మినరల్ వాటర్‌ను ప్లాస్టిక్ బాటిళ్లలో ప్యాక్ చేయడం ద్వారా మైక్రోప్లాస్టిక్‌లు మనిషి దేహంలో చేరి రోగాల పాలు చేస్తున్నాయి. ప్లాస్టిక్ రేణువులు శరీరంలో హార్మోన్లను దెబ్బతీస్తున్నాయి.

ప్రజలందరికీ రక్షిత జలాలు

పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలో ప్రజలందరికీ రక్షిత జలాలు అందించడానికి మూడు దశాబ్దాలుగా ప్రయత్నాలు జరిగితూ ఉన్నప్పటికి కార్య రూపం దాల్చలేదు. గ్రామీణులకు శుద్ధి జలాలు అందించడానికి గత టీడీపీ హయాంలో వాటర్ గ్రిడ్ పథకానికి రూపకల్పన జరిగింది. అయితే వైసీపీ పాలనలో అది మరుగన పడింది. ఇప్పుడు గ్రామాల్లో వాటర్ గ్రిడ్ పథకంతో పాటు ప్రత్యేక పైపులైన్ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. నూతన పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు, నిడదవోలు, పాలకొల్లు పట్టణాలకు నేరుగా విజ్జేశ్వరం నుంచి పైపులైన్ ద్వారా తాగునీరుకు ప్రతిపాదన జరగ్గా ఇప్పుడు ఆ ప్రాజెక్టులో భీమవరం, నరసాపురం పట్టణాలు కలిపారు. గతంలో రూ.226 కోట్లు ప్రతిపాదన చేయగా ఇప్పుడు ఆ ఖర్చు రెట్టింపు అయ్యేటట్లు కనిపిస్తున్నది. గ్రామాలకు సైతం సుమారు 15 వందల కోట్లుతో ప్రత్యేక పైపులైన్ ఏర్పాటుకు రూపకల్పన చేస్తున్నారు. కార్యరూపం దాల్చి పనులు పూర్తయితే జిల్లా వాసులు కలుషిత తాగునీటి నుంచి బయట పడతారు. రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చొరవతో వచ్చే ఒకటి, రెండు సంవత్సరాలలో ప్రాజెక్ట్ పనులు పూర్తవుతాయిని జిల్లా వాసులు ఆశిస్తున్నారు.



లంకలకోడేరులో రూ.2.50 కోట్లతో చేపట్టిన మంచినీటి పథకం పనులకు శంకుస్థాపన చేసి శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రామానాయుడు

ప్రజలందరికీ రక్షిత మంచినీరు

జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు

పాలకొల్లు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కలుషిత నీటితో ప్రజలు రోగాలకు గురవుతున్నారని 100 శాతం శుద్ధి చేసిన నీరు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు రూరల్ మండలం లంకలకోడేరులో రూ.2.55 కోట్లు వ్యయంతో చేపట్టనున్న రక్షిత మంచినీటి పథకం పనులకు ఆయన శుక్రవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ 2013లో చంద్రబాబునాయుడు పాదయాత్ర చేస్తున్న సమయంలో రాత్రి 11 గంటల సమయంలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి మరీ ఈ చెర్వును చూపించి తాగునీటి దుస్థితిని వివరించామన్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం రాగానే అప్పటిలోనే రూ.2.50 కోట్లతో లంకలకోడేరు పరిసర గ్రామాల ప్రజలకు ప్రాజెక్ట్ ద్వారా రక్షిత మంచి నీరు అందిస్తే గత వైసీపీ ప్రభుత్వం ఈ తాగునీటి వ్యవస్థలను భ్రష్టు పట్టిచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రక్షిత మంచినీటి పథకాలకు పూర్వవైభవం తీసుకొచ్చి ప్రతీ కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. సర్పంచ్ చొప్పల రజని, జడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, బీజేపీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్ ఉన్నమట్ల కబర్ధి, పాలకొల్లు డీసీ ఛైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



నిమ్మకాయలను ఎగుమతికి సిద్ధం చేస్తున్న హమాలీలు

నిమ్మ అధరహో

కిలో నిమ్మ రూ.50- రూ.80

దిగుబడులు లేక రైతుకు ఆదాయం అంతంత మాత్రమే

పెదవేగి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నిమ్మ ధర రైతుల ఆశలకు అనుగుణంగా ఉంది. ఏడాదికాలంగా నిమ్మకాయల ధర రైతుల ఆశలకు అనుగుణంగా కిలో రూ.50 తగ్గకుండా నిలకడగా ఉంది. ఏడాది కిందట కిలో నిమ్మ రూ.100లకు వెళ్లినా తిరిగి రూ.50లకు తగ్గకుండా, రూ.80 మధ్య నిలకడగా కొనసాగుతూ వచ్చింది. అంతకు ముందు ఏడాదివరకు నిమ్మకాయలకు గిట్టుబాటు ధరలేక అల్లాడిన రైతులు ఏడాది కాలంగా ధర ఆశాజనకంగా, నిలకడగా ఉండడంతో ఆనందంగా ఉన్నారు. గతంలో ధర పెరిగినా వారం, పదిరోజుల వరకే ఉండేది. కానీ ఇప్పుడు ఏడాది పొడవునా నిమ్మకు మంచి ధర పలుకుతుండడం లాభదాయకమని రైతులు చెప్తున్నారు. తగ్గిన దిగుబడి కారణంగానే నిమ్మకాయల ధర పెరిగిందని, కాయలు లేనప్పుడు ధర ఎంత ఉంటే మాత్రం ఏం లాభమని కొంతమంది రైతులు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. బయట రిటైల్ మార్కెట్‌లో కాయ ఒక్కింటికి నాలుగైదు రూపాయలకు విక్రయిస్తున్నారు. గతంలో సరైన ధరలేక నిమ్మ తోటలను తెగ నరికిన రైతులు ఇప్పుడు తోటల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు.



లారీలోకి లోడు చేస్తున్న హమాలీలు

• 30 లారీలకు తగ్గిన దిగుబడి..



మార్చి, ఏప్రిల్ నెలలో నిమ్మకాయలు దక్షిణ భారతం నుంచి ఉత్తర భారతానికి సాధారణంగా 200 వరకు లారీల సరుకు వెళ్ళేది. అలాంటిది ఇప్పుడు 30 లారీల దిగువకు పడిపోయింది. దిగుబడి గణనీ యంగా తగ్గడంతో సరుకులేక ధర పెరిగింది. దిగుబడి తగ్గడానికి వాతావరణంలో వచ్చిన మార్పులే కొంతవరకు కారణం. నిమ్మ పూత లేక దిగుబడి తగ్గి, మార్కెట్‌కు కాయలు రాకపోవడం కూడా ధర పెరగడానికి ఒక కారణం. గతంలో 25 నుంచి 30 శాతం మంది రైతులే లాభాలను అందుకునేవారు. కానీ ఇప్పుడు ఏడాది కాలంగా 85 శాతం పైగా రైతులు గరిష్ట ధరను అందుకున్నారు.

- ఆలపాటి రంగారావు,దెందులూరు మార్కెట్ యార్డు వర్తక సంఘం అధ్యక్షుడు

• డిమాండ్ కారణంగా మంచి ధర



డిమాండ్ పెరగడంతో నిమ్మకు మంచి ధర లభిస్తోంది. ఇది నిమ్మ తోటల మను గడకు శుభ సూచకంగా చెప్పవచ్చు. ఏడాది కాలంగా కిలో రూ.50 నుంచి రూ.80 వరకు ధర నిలకడగా ఉండడం రైతుకు లాభ దాయకం. దీంతో చాలామంది రైతులు కొంతమేర నష్టాలను అధిగమించే అవకాశం ఉంది. కొంతమంది రైతులు ధర లేనప్పుడు చెట్లను కొట్టివేయడం, ధర ఉన్నప్పుడు మొక్కలు నాటడం చేస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. సాగులో ఒడిదుడుకులు అనేవి సహజం. అన్నింటిని తట్టుకుని నిలబడితే ఎప్పటికైనా లాభమే ఉంటుంది.

- తాతా యశ్వంత్ రాజశేఖర్, వర్తక సంఘం సభ్యుడు, పెదవేగి

• ఉపాధి హామీ పథకం అమలు చేయాలి



ఈ ఏడాది దిగుబడి తగ్గింది. తక్కువ దిగుబడి వచ్చినా ధర బాగుండడంతో ఆశించిన ఆదాయం వచ్చింది. కానీ పెట్టుబడి మాత్రం పెరిగిపోయింది. ఎరువులు, పురుగు మందులు,కూలీల ఖర్చులు పెరిగిపోయాయి. ప్రభుత్వంకూడా ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందిస్తే రైతుకు మరింత మేలు జరుగుతుంది. ఉపాధిహామీ పథకంలో కూలీలు రైతుల పొలాల్లో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- బండారు ప్రసాద్, రైతు, కూచింపూడి, పెదవేగి మండలం



ఆరోగ్యానికి ఆర్గానిక్ డ్రింక్..

ఊరూరా రాగి,జొన్న జావ విక్రయాలు

చింతలపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వేసవి వచ్చిందంటే శీతల పానీయాలకు డిమాండ్. గ్రామాల్లో జ్యూస్ సెంటర్లు, సూపర్ కూల్‌డ్రింక్స్ వెలుస్తున్నాయి. ఆరోగ్య పరంగా ఎలా ఉన్నా దాహం తీర్చుకోవడం కోసం వీటిని తాగేస్తుం టారు. అయితే చింతలపూడికి చెందిన దేవగురు సత్యనారాయణ ఆరోగ్యానికి ఆర్గానిక్ డ్రింక్ అంటూ ఊరూరా తిరుగుతూ రాగి జావ అమ్ముతున్నాడు. తనకున్న టీవీఎస్ మోటారు సైకిల్‌పై ఉదయం 7 గంటల నుంచి విక్రయి స్తుంటాడు. 15 లీటర్ల స్టీల్ హాట్ క్యాన్‌లలో రాగి జావ, జొన్న జావ రెండు రకాలు తయారు చేసుకుని గ్లాసు 20 రూపాయలు చొప్పున ఊరంతా తిరిగి అమ్ముతుంటాడు. యూట్యూబ్‌లో తయారు చేయడం తెలుసుకుని దీనికి సంబంధించిన రాగులు, జొన్నలు కొని వాటిని బాగుచేసుకుని పిండి తయారు చేసుకుని ఉదయం జావ తయారు చేసుకుంటాడు. వీటికి అవిసగింజల పొడి, ధనియాల పొడి, నువ్వుల పొడి, వాము, శొంటి పొడులు కలిపి ఉడకబెట్టిన మొక్కజొన్న, పల్లీలు, పెసలు, బొబ్బర్లు, శనగలు వేసి అమ్ముతుంటాడు. కేవలం జావ మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన ఈ పొడులు, చిరు ధాన్యాలు వేయడం వల్ల రుచితోపాటు ఆరోగ్యానికి మంచిదని చెబుతున్నాడు. గత ఏడాది అమ్మకాలు బాగుండడంతో ఈ ఏడాది కూడా వ్యాపారం కొనసాగిస్తున్నట్టు చెబుతున్నాడు.

మాధవాయిపాలెం రేవు రూ.4.18 కోట్లు

వేలంలో రికార్డు ధర



వేలం నిర్వహిస్తున్న మండల పరిషత్ అధికారులు

నరసాపురం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మాధవాయిపాలెం రేవు పాటలో శుక్రవారం సరికొత్త రికార్డు నమోదైంది. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ, రహస్య వేలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా టేకిశెట్టిపాలెం గ్రామానికి చెందిన విఘ్నేశ్వర క్వారీ, బోట్స్‌మెన్ లేబర్, కాంట్రాక్టు కోపరేటివ్ సొసైటీ రూ 4,18,19,959 ధరకు రేవును దక్కించుకుంది. వందేళ్ల చరిత్రలో ఇదే హెచ్చు మొత్తం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన వేలంలో రూ.33 లక్షలు చెల్లించి ఎనిమిది మంది పాల్గొన్నారు. ముందుగా బహిరంగ వేలం నిర్వహించారు. విఘ్నేశ్వర సొసైటీ రూ 3.64కోట్లు, రాజులంక సొసైటీ రూ 3.40 కోట్లకు వెళ్లాయి. వేలం ఖరారు చేయకుండా రహస్య టెండర్లు తెరిచారు. అందులో కూడా కోనసీమ జిల్లాకు చెందిన విఘ్నేశ్వర సొసైటీ అత్యధిక మొత్తం కోట్ చేసింది. రెండో స్థానంలో ది నరసాపురం శాండ్ అండ్ కోపరేటివ్ సొసైటీ రూ 3.95కోట్లకు కోట్ చేసింది. విఘ్నేశ్వర సొసైటీ రూ 25లక్షల హెచ్చు మొత్తంతో రేవు నిర్వహణ బాధ్యత దక్కించుకున్నట్లైంది. జిల్లా అధికారులు వేలం అధికారికంగా అమోదించాల్సి ఉంది. అనంతరం ఏప్రిల్ 1 నుంచి రేవు నిర్వహన బాధ్యతలను మండల పరిషత్ పాట దారుకు అప్పగించనుంది. మరోవైపు ఊహించని దాని కంటే అత్యధిక మొత్తం ఆదాయం రావ డంతో అధికారవర్గాల్లో ఆనందోత్సహాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది ఏడు నెలలకే వేలం నిర్వహించగా రూ.2.96కోట్లు ఆదాయం వచ్చింది. ఎంపీపీలు సోని, మల్లికార్జునరావు, జడ్పీ అధికారులు భవాని, హరికృష్ణ, ఎంపీడీవో రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల సమ్మె వాయిదా

ఏలూరుసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 24, 25 వతేదీలలో నిర్వహించాల్సిన సమ్మె వాయిదా పడింది. శుక్రవారం ఢిల్లీలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్, ఇండియన్ బ్యాంకు అసోసియేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, సెంట్రల్ లేబర్ కమిషన్ మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో సమ్మెను వాయిదా వేసినట్లు పశ్చిమ గోదావరి జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మోహన్ శుక్రవారం తెలిపారు. సోమ, మంగళ వారాలలో బ్యాంకులు యధావిధిగా పనిచేస్తాయని, ఖాతాదారులు గమనించాలని కోరారు.

గ్రామీణాభివృద్ధి పనులపై జడ్పీ చైర్‌పర్సన్ సమీక్ష

ఏలూరుసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో గ్రామీణాభివృద్ధి పనులు, ఎన్‌టీఆర్ ఇళ్లు , ఉపాధి హామీ ద్వారా అభివృద్ధి పనులపై సంబంధిత శాకాధికారులతో జడ్పీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శుక్రవారం సమీక్షించారు. ఉపాధి హామీ పథకం అమలుపై సమగ్రంగా చర్చించటమే కాకుండా సీసీ రహదారులు, ఫాం పాండ్స్, పశుషెడ్ల నిర్మాణాలు, ఉపాధి కూలీలలకు పనికల్పన వంటి అంశాలుపై జడ్పీ చైర్‌పర్సన్ సమీక్షించారు. డీఆర్‌డీఏ సమీక్షలో భాగంగా జిల్లాలో డ్వాక్రా మహిళా సంఘాల ఆర్థిక స్థితిపై చర్చించారు. డ్వాక్రా సంఘాలకు బ్యాంకు రుణాలు మరింత పెంచి లబ్దిదారుల సంఖ్యను కూడా పెంచాలని సూచించారు. సున్నా వడ్డీ పథకం, ఆత్మకల్ప పథకాలపై చర్చించటం జరిగింది. గృహ నిర్మాణాలకు నిధులు సకాలంలో విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ సీఈవో కె.భీమేశ్వర్, డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ సొమ్ము మాయం

ఉంగుటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు గ్రామ పంచాయతీ కార్యాలయం బీరువాలో ఉంచిన ఇంటి పన్ను సొమ్ము మాయమైంది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి.పంచాయతీ కార్యదర్శి బొడ్డు రవిచంద్ర కుమార్ మాట్లాడుతూ ఆదివారం పంచాయతీ కార్యాలయం తాళాలు పోయాయని తెలిపారు. మరుసటి రోజున కొత్త తాళం తెచ్చి వేశామని, గురువారం ఉదయం పంచాయతీ కార్యాలయం తెరచి చూడగా బీరువా తాళాలు పగల గొట్టి ఉండడాన్ని కార్యదర్శి గుర్తించారు. బీరువాలో ఉంచిన పంచాయతీ పన్ను తాలుకా మొత్తం రూ.90వేలు కనిపించలేదు. దీనితో చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. ఇదే కార్యాలయంలో ట్యాంక్ వాచర్‌గా పని చేస్తున్న వ్యక్తి విధులకు గైర్హాజరవడంతో అతడిపై అనుమానం వచ్చినట్లు భావిస్తున్నారు.

కార్యదర్శి అరెస్ట్

భీమవరం క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం రాయలం, చిన అమిరం పంచాయతీల్లో గతంలో కార్యదర్శిగా పనిచేసిన సాగిరాజు కిశోర్ గోపాలకృష్ణంరాజును శుక్రవారం అరెస్ట్ చేసినట్లు భీమవరం డీఎస్పీ ఆర్‌జి జయసూర్య తెలిపారు. ఇప్పటికే రాయలం పంచాయతీలో సొమ్ములు దుర్వినియోగం చేసిన కేసులో అరెస్ట్ అయి బెయిల్‌పై వచ్చిన గోపాలకృష్ణంరాజును చిన అమిరం పంచాయతీ కేసులో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. రెండో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించారని డీఎస్పీ తెలిపారు.

నిట్ విద్యార్థులకు బహుమతులు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు పలు విభాగాల్లో రాణిస్తుండటం అభినందనీయమని ఏపీ నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వీ రమణారావు కొనియాడారు. బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఏటా గుర్తించి వారిని బరోడా అచీవర్స్ అవార్డులతో సత్కరించడం ఆనవాయితీ.

ఇందులో భాగంగా ఏపీ నిట్‌లో బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న కలిదిండి సూర్యతేజ సత్య వర్మ (బెస్ట్ ఇన్ అకడమిక్స్), తూమ్మురి మంజునాథ్ (బెస్ట్ ఇన్ స్పోర్ట్స్), ఎన్ హర్షిత్ (బెస్ట్ ఆల్ రౌండర్)కు అవార్డులతో పాటు రూ.31వేలు చొప్పున నగదు బహుమతిని శుక్రవారం అందించారు. రిజిస్ట్రార్ బి. దినేష్ శంకరరెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా డిప్యూటీ రీజనల్ హెడ్ చింతలపూడి శ్రీనివాసులు, రీజనల్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ రాహుల్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రికి సుస్తీ



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి నిత్యం రోగుల రద్దీతో కిటకిటలాడుతుంది. ప్రధానంగా ప్రసవాల కోసం దూరప్రాంతాల నుంచి గర్భిణులు తణుకు ఆస్పత్రికి వస్తారు. జాతీయ రహదారి, ప్రధాన రహదారులపై ప్రమాదాల్లో క్షతగాత్రులను ఇక్కడికి తరలిస్తారు. అరకొర సౌకర్యాలతో రోగులకు పూర్తిస్థాయి సేవలు అందించలేకపోతున్నారు. రక్త పరీక్షలు, ఎక్స్‌రే తప్ప ఇతర పరీక్షలకు పరికరాలు లేవు. వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.


ఓపీ రిజిస్ట్రేషన్‌కు క్యూ

- తణుకు ఆస్పత్రిలో రోగుల రద్దీ
- వేధిస్తున్న వైద్యుల కొరత
- వైద్య పరీక్షలకు పరికరాలు లేవు
- ప్రధాన విభాగాల్లో అందని సేవలు
- పారిశుధ్యం అంతంత మాత్రం

తణుకు, మార్చి20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతి నెల అవుట్ పేషెంట్ సేవలకు సుమారు 20 వేల మంది వస్తారు. నిత్యం 700 మంది అవుట్ పేషెంట్లతో ఆస్పత్రి కిటకిటలాడుతుంది. నిత్యం 80 మంది ఇన్ పేషెంట్లు ఉంటారు. నెలకు సుమారు 250 ప్రసవాలు జరుగుతాయి. 12 పీహెచ్‌సీలు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, భీమవరం, నరసాపురం ఏరియా ఆసుపత్రులతో పాటు తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల, రావులపాలెం నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. ఆస్పత్రి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పది పడకల డయాలసిస్ సెంటరు నిర్వహిస్తున్నారు. అదనంగా మరో 5పడకలు ఏర్పాటు చేయనున్నారు. అవుట్, ఇన్ పేషెంట్లకు చాలా వరకు మందులు ఉచితంగా అందిస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేయని మందుల కోసం ఆసుపత్రి కమిటీ నిధుల నుంచి నెలకు రూ.50 వేలు ఖర్చు చేస్తున్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రతిపాదనలు

తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ రూ.19.2 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ప్రధానంగా కొత్త భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నెలాఖరుకు వైద్యుల పోస్టులు భర్తీ



ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు భర్తీ కాలేదు. ఇటీవల ఏఆర్‌టీ సెంటర్‌లో వైద్యుడిని నియమించారు. మరికొన్ని వైద్యుల పోస్టులు ప్రమోషన్‌పై నెలాఖరుకు భర్తీ కావచ్చు. అందుబాటులో ఉన్న వనరులు, వైద్య విభాగాల్లో రోగులకు మెరుగైన సేవలందిస్తున్నాం.

వెలగల అరుణ, ఆసుపత్రి సూపరింటెండెంట్

వైద్యుల పోస్టులు ఖాళీ..!

కీలక విభాగాల్లో వైద్యులు అందుబాటులో లేరు. ప్రధానంగా ఆర్‌ఎంవో పోస్టు కొన్నేళ్ల నుంచి ఖాళీగా ఉంది. వివిధ విభాగాల్లో 34 మంది వైద్యులు ఉండాలి. 22 మంది వైద్యులు మాత్రమే పని చేస్తున్నారు. 12మంది వైద్యులు లేకపోవడంతో సంబంధిత విభాగాల్లో సేవలందించడం లేదు. సివిల్ సర్జన్ ఆర్‌ఎంఒ-1, డిప్యూటీ సివిల్ సర్జన్ జనరల్-1, డిప్యూటీ సివిల్ సర్జన్ రేడియాలజిస్టు-1 (పదోన్నతిపై భర్తీ చేయాలి), డిప్యూటీ సివిల్ సర్జన్ పాథాలజీ-1, డిప్యూటీ సివిల్ సర్జన్ జనరల్-2, సివిల్ అసిస్టెంట్ సర్జన్ జనరల్ మెడిసిన్-1, సివిల్ అసిస్టెంట్ సర్జన్ గైనకాలజీ-1, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పిడియాట్రిక్-1, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పలమనాలజిస్టు-1, సివిల్ అసిస్టెంట్ జనరల్ 2 ఖాళీగా ఉన్నాయి. డార్క్ రూమ్ అసిస్టెంట్‌లు 2 ఖాళీగా ఉంటే ఒకటి అనధికార సెలవులో ఉండడంతో మొత్తం గా మూడు ఖాళీగా ఉన్నాయి. ఆడియోమెట్రిషన్-1, జూనియర్ అసిస్టెంట్-1, సీనియర్ అసిస్టెంట్-2 ఖాళీగా ఉన్నాయి.

పారిశుధ్య కార్మికుల కొరత

ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది లేరు. ఏరియా ఆసుపత్రిగా వంద పడకలతో సేవలందించినప్పుడు 19 మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిగా 150 పడకల స్థాయి పెరిగినా పారిశుధ్య కార్మికులను పెంచలేదు. కార్మికులు పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారు. అదనంగా 50 మందిని నియామించాల్సి ఉంది.

- **బ్లడ్ బ్యాంక్ లేదు**

ప్రసవాలు, ప్రమాదాల కేసుల్లో రక్తం అవసరమైన వారు బయట బ్లడ్ బ్యాంకులను ఆశ్రయించాల్సిందే. ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదలు చేసినా స్టోరేజీ యూనిట్‌కు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి ఇవ్వలేదు. రక్తం ప్రాసెస్ చేసే సమయంలో వ్యర్థాల నిర్వహణకు సేవేజ్ ట్రీట్‌మెంటు అందుబాటులో లేదు.

- **ప్రధాన వైద్య పరీక్షలు లేవు**

ఆసుపత్రిలో థైరాయిడ్ పరీక్షలకు సంబంధించిన పరికరాలు అందుబాటులో లేవు. సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్ సౌకర్యం లేదు. పరీక్షలు అవసరమైన రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిందే. ఆస్పత్రిలో ఎక్స్‌రే, రక్త పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

- **ఆర్థోపెడిక్ సేవలు లేనట్లే..!**

ప్రమాదాల్లో ఎముకలు విరిగిన బాధితులను ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయాల్సిందే. ఆర్థోపెడిక్ విభాగంలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. వారిలో ఒకరు అనధికార సెలవు, మరొక వైద్యురాలు ప్రసూతి సెలవులో ఉన్నారు. ఆస్పత్రిలో ఇద్దరు మత్తు వైద్యులు అవసరం కాగా అన్ని విభాగాల ఆపరేషన్లకు ఒక్కరే సేవలందిస్తున్నారు. ఆపరేషన్ నిర్వహణకు అవకాశం ఉన్నా మత్తు వైద్యుడు లేక సేవలందించలేని పరిస్థితి నెలకొంది.

ప్రాణం తీసిన ఈత సరదా

కాల్వలో మునిగి ఇద్దరు బాలురు మృతి

- చినకాపవరంలో విషాదం


చెరువు నుంచి వెలికితీసిన మృతదేహాలు (ఇన్‌సెట్) పవన్‌సాయి మూర్తి, శరత్‌కుమార్ (ఫైల్)

ఆకివీడు రూరల్ మార్చి 21(ఆంధ్రజ్యోతి): సరదాగా కాల్వలో ఈతకు వెళ్లిన ఇద్దరు బాలురు మృత్యువాత పడ్డారు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన ఆకివీడు మండలం చిన కాపవరంలో విషాదం నింపింది. ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న కఠారి పవన్ సాయి మూర్తి(11), కౌరు శరత్‌కుమార్ (10) పాతవయ్యేరులో ఈతకు వెళ్లి మృతి చెందారు.

చినకాపవరం పంచాయతీ పరిధిలోని దండగర్ర ఆంజనేయస్వామి గుడి వద్ద కాల్వలో పవన్ మృతదేహం తేలియాడడం స్థానికులు గమనించారు. వెంటనే మృతదేహం వెలికితీసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అంతలోనే జానకి రామ రాజపురం సబ్‌స్టేషన్ వద్ద దూళ్ల రేవులో శరత్ మృతదేహం తేలియాడడంతో వెలికి తీశారు. పెద కాపవరం గ్రామానికి చెందిన కఠారి వెంకట నాగేశ్వరరావు, రజితల కుమారుడు పవన్‌సాయి మూర్తి. కౌరు వంశీకృష్ణ, జ్యోతి కుమారుడు శరత్ కుమార్. వారి కుటుంబాలు ఏడాది కాలంగా చిన కాపవరంలో నివాసం ఉంటున్నారు. పాఠశాలలో చురుకుగా ఉండే బాలుర మృతితో ఈప్రాంతం లో విషాదం అలుముకుంది. మృతదేహాల వద్ద తల్లి, చెల్లెళ్ల రోదన చూపరులను కలచివేసింది. విగత జీవులుగా పడి ఉన్న బాలురిని చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతయ్యాడు. తాడేపల్లిగూడెం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి పల్లిపోగు వరప్రసాద్ (20) శుక్రవారం మరో ఏడుగురు స్నేహితులతో పెంటపాడు మండలం పరిమెళ్లలోని కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. అంతలోనే కాల్వ లోతులోకి జారిపోయాడు. అతడిని బయటకు లాగేందుకు స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కళ్ల ముందు స్నేహితుడు కాల్వలో కొట్టుకుపోతుంటే మిగిలిన వారు భయంతో వణికిపోయారు. గల్లంతైన వరప్రసాద్ కోసం అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు జల్లెడ పట్టినా ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్సై స్వామి తెలిపారు.

టిప్పర్ లారీ ఢీకొని మహిళ మృతి


సంఘటనాస్థలిలో మహిళ మృతదేహం (ఇన్‌సెట్) సుజాత (ఫైల్)

పెనుమంట్ర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నెగ్గిపూడి సమీపంలో జరిగిన ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న చిర్ల సుజాత (55)ను టిప్పర్ లారీ ఢీకొనడంతో తల ఛిద్రమైంది. మార్టేరు ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్న సుజాత శుక్రవారం మధ్యాహ్నం భోజనానికి యాక్టివా మోటారు వాహనంపై ఇంటికి వెళుతున్నారు. మార్గమధ్యలో టిప్పర్ లారీ ఢీకొని వెనుక టైరు తల పైనుంచి వెళ్లిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఆమె తల ఛిద్రం కావడంతో సంఘటన స్థలం రక్తసిక్తమైంది. మృతురాలి భర్త చిర్ల చిన సూర్యనారాయణ మార్టేరు ఎస్‌విజి హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. పెనుమంట్ర ఎస్‌ఐ పీ స్వామి సంఘటనా స్థలం పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెగ్గిపూడిలో విషాదఛాయలు

ఉపాధ్యాయురాలు చిర్ల సుజాత మృతితో ఉపాధ్యాయులు శోకసముద్రంలో మునిగిపోయారు. గుర్తు పట్టలేనంతగా తల భాగం నుజ్జు కావడంతో బంధువులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు దిగ్భ్రాంతి చెందారు.

కారు ఢీకొని యువకుడు..

భీమడోలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందాడు. వేగివాడ ప్రాంతానికి చెందిన ఘంటా భరత్ (21) గోపాలపురానికి చెందిన చల్లా సుబ్రహ్మణ్యం మోటారు సైకిల్‌పై తాడేపల్లిగూడెం వెళుతున్నారు. భీమడోలు జాతీయ రహదారి కనకదుర్గమ్మ గుడి సమీపంలో వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. గాయపడిన వారిని భీమడోలు ఆసుపత్రికి అనంతరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ భరత్ మృతి చెందగా సుబ్రహ్మణ్యాన్ని విజయవాడ తరలించారు. భీమడోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏలూరు రేంజ్‌లో 31 మంది ఏఎస్‌ఐలకు పదోన్నతి

ఏలూరు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్‌లో ఏఎస్‌ఐలుగా పనిచేస్తున్న 31 మందికి ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవిజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు ఏఆర్ ఎస్‌ఐలకు ఆర్‌ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించారు. అల్లూరు సీతారామరాజు జిల్లాలో ఆరుగురు, కాకినాడ జిల్లాలో నలుగురు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో 8మందికి, తూర్పు గోదావరి జిల్లా 8 మంది, ఏలూరు జిల్లా ముగ్గురికి ఏఎస్‌ఐల నుంచి ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించారు. ఎన్టీఆర్ జిల్లాలో ఏఆర్‌ఐ ఎస్‌ఐలకు ఆర్‌ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి ఆత్మహత్య

భీమవరం క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఒక యువకుడు రూమ్‌లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ ఎస్‌ఐ బీవై కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా పొన్నూరు మండలం ఇటికంపాడు గ్రామానికి చెందిన ఆడిశెట్టి మస్తాన్‌రావు కుమారుడు గిరి పరమేశ్వర్ (20) భీమవరం ఆర్టీసీ గ్యారేజ్‌లో శిక్షణ కోసం కొద్ది రోజుల క్రితం వచ్చాడు. ప్రస్తుతం అక్కడ ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. ఈ నెల 19న గిరి పరమేశ్వర్ ఫోన్ మాట్లాడుతుండగా టి.శ్రీనివాసరాజు అనే వ్యక్తి తగాదా పడ్డాడు. అంతే కాకుండా కాలితో తన్నినట్లుగా మస్తాన్‌రావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ మనస్తాపంతోనే ఈ నెల 20వ తేదీ తాను ఉంటున్న రూమ్‌లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడంటూ ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

కొమ్ముగూడెంలో బాలిక మృతి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెంలో బాలిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్ముగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సకినాల సంధ్య (14) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై తండ్రి దశరాజు కుమార్తె కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా స్థానికుల కథనం మరోలా ఉంది. గ్రామంలోని తాపీపనిచేసుకునే మరపట్ల అశోక్ బాలికతో అసభ్యంగా వ్యవహరించడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఈ సంఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఆపరేషన్ గరుడ

మందుల షాపుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్ అధికారుల సంయుక్త దాడులు


ఏలూరులోని మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

(భీమవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఆపరేషన్ గరుడతో ఔషధ విక్రయాల్లో అక్రమ దందా బయట పడింది. మత్తు ప్రేరేపిత డ్రగ్స్, గర్భవిచ్ఛిత్తి, వయాగ్రా మందులను పెద్ద మొత్తంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లిగూడెం, తణుకు, అత్తిలిలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఈగల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ డ్రగ్స్ తనిఖీ అధికారులు తనిఖీలు చేపట్టారు. మూడు పట్టణాలలో ముఖ్యమైన మందుల దుకాణాల్లో తనిఖీ చేశారు. గీతా ఫార్మసూటికల్ కంపెనీలో శ్రీను అక్రమ విక్రయాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లా డ్రగ్స్ విభాగం అందించిన సమాచారం మేరకు శ్రీనును అదుపులోకి తీసుకుని విచారించారు. పెద్ద మొత్తంలో డ్రగ్స్, వయాగ్ర, గర్భవిచ్ఛిత్తి మందులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్టుపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

ఏడాది క్రితం సీజ్ చేసినా..


తాడేపల్లిగూడెంలో ఏడాదిక్రితం ప్రముఖ మందుల షాపును సీజ్ చేశారు. తాజాగా మరోపేరుతో మందుల షాపును తెరిచారు. గర్భవిచ్ఛిత్తి మందులు, మానసిక ఒత్తిళ్లకు సంబంధించిన మందులు డాక్టర్ సిఫార్సు ఉంటేనే విక్రయించాలి. జిల్లాలో ఏడాది నుంచి మందుల షాపులపై నిఘా పెంచడంతో ఇలాంటి మందులు విక్రయించడానికి వ్యాపారులు భయపడుతున్నారు. తాజాగా ఆపరేషన్ గరుడ పేరిట ప్రముఖ మందుల షాపుల్లో తనిఖీల్లో అక్రమ విక్రయాలను గుర్తించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

ఆసుపత్రుల్లో అధిక ధరలు

మానసిక వ్యాధులకు ప్రైవేట్ ఆస్పత్రులలో మందులు ఉంటున్నాయి. అక్కడ ఎంఆర్‌పికి విక్రయిస్తున్నారు. మనసిక ఒత్తిడి, దిగులు వంటి సమస్యలున్నవారికి ఇతర ఆరోగ్య సమస్యలకు జనరిక్ మందులు ఇచ్చి ఎంఆర్‌పీ వసూలు చేస్తున్నారు. ఇటీవల ప్రైవేట్ మందుల షాపుల్లో విక్రయాలపై రాష్ట్ర వ్యాప్తంగా కఠిన నిర్ణయం తీసుకున్నారు. వైద్యుల సిఫార్సు చేసిన మందుల చీటీ నకలు తీసుకుంటున్నారు. అది కూడా వారానికి సంబంధించిన మందులను ఇస్తున్నారు. ఈ క్రమంలోనే బిల్లులు లేకుండా మందులను రప్పించి విక్రయిస్తున్న వైనాలు బయట పడుతున్నాయి. కొందరు ఏజెంట్లు నేరుగా మందుల షాపులకు తెచ్చి విక్రయిస్తున్నారు. వాటికి బిల్లులు లేకపోవడంతో తనిఖీలు నిర్వహించినపుడు మందుల షాపుల యజమానులు బయట పడుతున్నారు. ఏజెంట్లు, తయారీ కంపెనీలపై ఎటువంటి చర్యలు లేవు.

ఏలూరు నగరంలో..

ఏలూరు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని సద్భావన మెడికల్ షాపు, ఉదయ్ జనరిక్ మెడికల్ షాపు, లైఫ్ ఫార్మసీ, నూజివీడు బాలాజీ ఫార్మసీలో తనిఖీలు నిర్వహించగా గడువుతీరిన మందులు, నిల్వల్లో తేడాలు, గర్భ విచ్ఛిత్తి మాత్రలు, మత్తు బిళ్లలు, గర్భం రాకుండా, సెక్స్ సామర్థ్యం పెంచే మందులు ఉన్నట్లు గుర్తించారు. ఈ దాడులు శుక్రవారం రాత్రి కూడా కొనసాగిస్తున్నారు. దాడుల్లో విజిలెన్స్ డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు, విజిలెన్స్ సీఐలు శివరామకృష్ణ, ప్రసాద్ కుమార్, భీమ డోలు సీఐ యుజె విల్సన్, ఏలూరు త్రి టౌన్ సీఐ వి కోటేశ్వరరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, విజయవాడ, రాజమహేంద్రవరం నుంచి వచ్చిన ఈగల్ టీమ్ బృందాలు పాల్గొన్నాయి. మెడికల్ షాపులపై దాడులు కొనసాగుతున్నాయని తెలియడంతో జిల్లాలోని పలు మెడికల్ షాపులు తాళాలు వేసి వెళ్లిపోయారు. ఇలాంటి షాపులను కూడా అధికారులు గుర్తించినట్లు తెలు స్తోంది. భవిష్యత్‌లో ఈషాపులపై దాడులు చేసే అవకాశాలు ఉన్నాయి.


తాడేపల్లిగూడెం మందుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

తణుకులో పెద్ద ఎత్తున మందులు స్వాధీనం

తణుకు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణంలోని పలు మందుల షాపుల్లో ఈగల్, విజిలెన్స్, ఔషధ నియంత్రణ శాఖ సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ ఎస్‌పి వి.శ్రీరామ్‌బాబు ఆధ్వర్యంలో ఎస్.ఐ కె.సీతారామ్ సమక్షంలో తనిఖీలు జరిగాయి. తంగిరాల వీధిలోని భవనంలో అనధికారంగా మందులు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పెంజర్ల నాగేశ్వరరావు వద్ద అనధికారంగా ఉన్న మత్తు ఉత్ప్రేరక మందులు, గర్భ విచ్ఛిత్తి మందులు, లైంగిక సామర్థ్యం కోసం అంటూ మందులు అమ్ముతున్నట్లు గుర్తించారు. రావులపాలెం కు చెందిన బచ్చు వెంకట సుబ్బారావు నుంచి మందులు కొనుగోలు చేస్తున్నాడని, ఏప్రిల్ 24 నుంచి ఇప్పటివరకు రూ.6 లక్షలు ఫోన్‌పే చెల్లింపులు గుర్తించారు. నాగేశ్వరరావుపై డ్రగ్, కాస్మొటిక్స్ యాక్టు 1940 అండర్ సెక్షన్ 18సి ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. శ్రీచిత్ర మెడికల్స్, గీతా ఫార్మసీలలో కూడా తనిఖీలు నిర్వహించారు. ఈగల్ సీఐ సూర్యచంద్రరావు, సీసీఎస్ సీఐ రాంబాబు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.మల్లికార్జునరావు, విజిలెన్స్ ఏఈ ఎం.అనిల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు

- తాడేపల్లిగూడెం రూరల్/అత్తిలి/ద్వారకాతిరుమల: తాడేపల్లిగూడెం పట్టణంలోని పోర్ట్‌గేట్ మెడికల్ షాపు లైసెన్స్, జీఎస్టీ ఇతర అంశాలపై విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబుదలి ఆలి, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం ఆరా తీశారు. అత్తిలిలోని సత్య కృష్ణ మెడికల్ షాపులో భీమవరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్‌అలీ పెద్ద ఎత్తున మందులను స్వాధీనం చేసుకున్నారు. ద్వారకాతిరుమలలోని మందుల షాపులలో డ్రగ్ ఇన్స్‌పెక్టర్ జీవణి, విజిలెన్స్ సీఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐ రంజిత్‌కుమార్, ఏఈ శ్రీనివాసరావు, ఈగల్ టీం సభ్యులు సూర్యచక్ర తదితరులు తనిఖీలు చేపట్టారు.

నేడు దిశ సమావేశం

ఏలూరుసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటి (దిశ) సమావేశం ఈనెల 22 వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్‌కుమార్ అధ్యక్షతన ఏలూరు కలెక్టరేట్‌లో జరుగుతుందని జడ్పీ సీఈవో కె భీమేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరవుతారని ఆయన వివరించారు.

ఎల్ఐసీ ఏజెంట్లకు ఆర్థిక భరోసా కల్పించాలి

ఏలూరు టూటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్లకు ఆర్థిక భద్రత కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎంపీ మహేశ్‌కుమార్ అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో శుక్రవారం స్పీకర్ ఓంప్రకాశ్ బిర్లాకు నివేదిక సమర్పించారు. అనంతరం పుట్టా మహేశ్ మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్లకు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఇన్సూరెన్స్ రెగ్యులేటరి అథారిటీ ఆఫ్ ఇండియా ఇటీవల తీసుకొచ్చిన మార్గదర్శకాల వలన ఏజెంట్ల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందన్నారు.



ముగిసిన సరమ్మ పేరంటాలు ఉత్సవాలు

లింగపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లింగపాలెంలో వారం రోజులుగా జరుగుతున్న శ్రీసరమ్మ పేరంటాలు ఉత్సవాలు నేటితో ముగిశాయి. ఈ అమ్మవారి మహోత్సవాలకు మండలంతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు తరలివచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు తాతిన రాధాకృష్ణ, చిలకబత్తుల శ్రీనివాసరావు, భీమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అంగడాల రేవంత్ పర్యవేక్షించారు.

వైభవంగా భీమనాగ లింగేశ్వరస్వామి కల్యాణం



దెందులూరు,మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : గాలాయగూడెం గ్రామంలోని శ్రీ అచ్చమ్మ పేరాంటాలమ్మ తల్లి ఆలయ ఆవరణలో భీమ నాగలింగేశ్వరస్వామి 7వ వార్షికోత్సవం సందర్భంగా కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బ్యాండు సన్నాయి మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారిని రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.



సాయినాథుని నగర సంకీర్తన

ఏలూరు కార్పొరేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఆదివారపుపేటలోని శ్రీ షిరిడీ సాయి ప్రేమ మందిర్ ఆరవ వారికోత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తులు సామూహికంగా నగర సంకీర్తన నిర్వహించి అనంతరం బాబా వారికి వివిధ రకాల పుష్పాలతో పుష్పార్చన నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రివేళల్లో షిరిడీలో వలే బాబా వారికి మధ్యాహ్న హారతి, సేజ్ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద వాసా ప్రసాదరావు గురువు సత్సంగాన్ని నిర్వహిఒచారు. ఆలయ అధ్యక్షులు ఇసుకపల్లి తాతారావు, సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో భక్తులచే సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపిస్తున్నామని, ఆదివారం మహా అన్నసమారాధనను ఏర్పాటు చేశామని, సోమవారం దీపోత్సవం, పల్లకీ సేవతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

పాదయాత్రగా శ్రీవారి క్షేత్రానికి భక్తులు



ద్వారకాతిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రానికి పాదయాత్రగా భక్తులు శుక్రవారం సాయంత్రానికే తరలి వచ్చారు. నల్లజర్ల మండలం అయ్యవరం మీదుగా వారంతా మండలంలోని రాళ్లకుంటలోకి ప్రవేశించారు. భీమడోలు మీదుగా వచ్చేవారు తిమ్మాపురం నుంచి క్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రహదారులు గోవింద నామస్మరణలతో మార్మోగాయి. పెనుమంట్ర మండలం, ఇతర ప్రాంతాల నుంచి వీరంతా క్షేత్రానికి వచ్చి శనివారం తెల్లవారుఝామున స్వామి తొలిదర్శనాన్ని చేసుకోనున్నారు.

వరి పంటలో జింకు వాడాలి

లింగపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో జింకు వాడటం వలన మొక్కవేరును తెగుళ్లు ఆశించవని మండల వ్యవసాయఅధికారి కోటగిరి మురళీకృష్ణ అన్నారు. మండలంలో వరిపంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట నాటే ముందే దుక్కులో ఎకరాకు 20 కేజీల జింకు, 50 కేజీల పొటాష్ వేయాలని సూచించారు.

అడవుల సంరక్షణపై అవగాహన

ఏలూరు అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అడవుల ప్రాముఖ్యత, సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కిరణజన్య సంయోగ క్రియ గురించి, కార్బన్ సింక్‌అయిన అడవుల ప్రాముఖ్యతలపై కళాశాల జువాలజీ లెక్చరర్ విజయ్‌కుమార్ వివరించారు. గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్, గ్లోబల్‌వార్మింగ్, అడవులను పరిరక్షించాల్సిన ఆవశ్యకతల గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రిన్సిపాల్ గిరిబాబు, వైస్‌ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణ ప్రచార సామగ్రి విడుదల

ఏలూరు అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ/ఎయిడ్స్, సుఖవ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏపీ సాక్స్(ఎయిడ్స్ నియంత్రణ మండలి) ముద్రించిన ప్రచార సామగ్రిని శుక్రవారం స్థానిక పవర్‌పేట అర్బన్ పీహెచ్‌సీలో జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ నాగేశ్వరరావు విడుదల చేశారు. వైద్యాధికారి గౌతమ్, ఏపీ సాక్స్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, సూపర్‌వైజర్ హరినాథ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఉంగుటూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు నియోజకవర్గంలో అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 33 మందికి క్యాంపు కార్యాలయంలో రూ.33లక్షల చెక్కులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారుల ఎంపికలో విమర్శలకు తావులేకుండా జాబితాను సిద్ధం చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, అభివృద్ధి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఏర్పాటు లక్ష్యంగా పనులు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమయంలో పార్టీలకతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణంలో ఉన్న ఇంటి ముందు ఫొటోలు దింపి, ఇల్లు ఉన్నవారికే మళ్లీమళ్లీ ఇళ్లను మంజూరు చేసి, పేదలకు నీడలేకుండా చేశారని, అలాంటి వాటికి తావులేకుండా, అర్హుల జాబితాను సిద్ధం చేయాలని ప్రభాకర్ సూచించారు.

సారా తయారీ, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు

టి.నరసాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సారా తయారు చేసిన విక్రయాలు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని చింతలపూడి ఎక్సైజ్ సీఐ అశోక్ హెచ్చరించారు. బంధంచర్ల సచివాలయంలో శుక్రవారం ఎక్సైజ్‌శాఖ, రెవెన్యూ శాఖాధికారులు సారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ అశోక్ మాట్లాడుతూ సారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలన్నారు. తహసీల్దార్ సాయిబాబా మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాలు చేస్తే పట్టుబడిన వారికి ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు.

డ్రెయినేలపై ఆక్రమణల కూల్చివేత

ఏలూరు టూటౌన్, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి): నగరంలో డ్రెయిన్ల ను ఆక్రమిం చుకుని నిర్మించిన కట్ట డాలను నగరపాలక సంస్థ అధికా రులు కూల్చి వేశారు. వెన్నవల్లివారిపేటలో డ్రెయినేజీపై నిర్మించిన కట్టడా న్ని పట్టణ ప్రణాళిక విభాగం అధికా రులు కూల్చివేశారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ అధికారి సాంబశివ రావు మాట్లాడుతూ డ్రెయిన్లను ఆక్ర మించి నిర్మాణాలు చేయడం వలన మురుగు పారకుండా రోడ్ల పైకి వస్తున్నదని అన్నారు. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డ్రెయినేలపై నిర్మాణాలను తొలగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ఆక్రమణలు కూల్చివేస్తున్న నగరపాలక సిబ్బంది

నేడు కాలువ గట్టుపై ఆక్రమణల తొలగింపు

ఉంగుటూరు, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి): ఉంగుటూరు మండలంలోని కాల్వగట్టు ఆక్రమణల తొలగింపు కార్యక్రమం శనివారం నాడు తెల్లవారుజాము నుంచి మొదలు పెట్టనున్నట్లు ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ తెలిపారు. మండలంలోని బాదంపూడి, నాచుగుంట, ఉంగు టూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరం గ్రామాల్లోని ఆక్రమణ తొలగింపు కార్యక్రమం ఏకకాలంలో జరుగుతుందని, కోర్టు వ్యవహారంలో ఉన్న కట్టడాలపై తదుపరి చర్యలు తీసుకుంటామని జాయింట్ యాక్షన్ కమిటీ వివరించింది

టెన్త్ పరీక్షలకు 570 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్/లింగపాలెం/ బుట్టాయగూడెం/ కామవరపుకోట, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి) : పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన ఇంగ్లీషు పరీక్షకు జిల్లాలో 570 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విభాగంలో 22,735మంది బాలబాలి కలు దరఖాస్తుచేసుకోగా 22,288 మంది, ప్రైవేటు (వన్స్ ఫెయిల్డ్)విద్యార్థులు 133మందికి 68మంది హాజరయ్యారని డీఈ వో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఏపీ సార్వత్రిక విద్యా పీఠం (అపోస్) దూరవిద్యవిభాగం టెన్త్ తెలుగుపరీక్షకు 460మంది అభ్యర్థులు దరఖాస్తుచేసుకోగా 402మంది, ఉర్దూ పరీక్షకు ఆరుగురుకి అందరూ హాజరయ్యారని వివరించారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదన్నారు. లింగపాలెం మండలంలో 15 మంది గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి కంఠా రామారావు తెలిపారు. బుట్టాయగూడెం మండలంలోని కెఆర్ పురం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ పీవీ చలపతిరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.రమేశ్ పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. కామవరపుకోట మండలంలో 12 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో డి.సుబ్బారావు తెలిపారు.



గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల వద్ద రెవెన్యూ అధికారులు

లయన్స్ క్లబ్‌కు ఫ్రీజర్ బాక్సు అందజేత

చింతలపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : యర్రంపల్లి గ్రామానికి చెందిన జగ్గవరపు విశ్వేశ్వరరెడ్డి 70 వేల రూపాయలు విలువ గల ఫ్రీజర్ బాక్సును లయన్స్ క్లబ్‌కు అందించారు. ఈ సందర్భంగా జిల్లా లయన్స్ గవర్నర్ కాకరాల వేణుబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న అవసరాలను గుర్తించి ఇటువంటి పరికరాలు అందచేయడం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విష్ణుకుమార్, జిల్లా కోశాధికారి వి.రామారావు, క్లబ్ నిర్వాహకులు జంగా చెన్నకేశవరెడ్డి, మాధవి, జయమ్మ, జె.ముత్తారెడ్డి, శ్రీహరిరెడ్డి, సి.హెచ్.మోహన్‌రావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆందోళన

చింతలపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ప్రజా చైతన్య యాత్రల ద్వారా ప్రజల నుంచి సేకరించిన సమస్యలపై తహసీల్దార్ డి.ప్రమద్వరకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు పాండురంగారావు మాట్లాడుతూ చింతలపూడి ప్రాంతంలో వంద పడకల ఆసుపత్రిని త్వరితగతిన పూర్తి చేయాలని, ఎత్తిపోతల భూనిర్వాసిత రైతుల పరిహారం చెల్లింపు చేయాలని, ఈ ప్రాంతంలో రోడ్లపై గుంతలు పూడ్చివేసే కార్యక్రమం సగంలో ఆగిపోయిందని, వాటిని పూర్తి చేయాలని కోరారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులు

పోలవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో చంద్రన్న స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ రుణాల కోసం 50 శాతం సబ్సిడీతో 29 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఓసీ కార్పొరేషన్‌లో 50 శాతం సబ్సిడీతో 31 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత నకలు, పాస్‌పోర్టు ఫొటోలతో ఆయా ప్రాంతాల మీ సేవా కేంద్రాలు, సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

25 మందికి ఉద్యోగాలు

భీమడోలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళకు 38 మంది హాజరుకాగా 25 మందికి ఉపాధి కల్పించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

విస్సన్నపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విస్సన్నపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. ఏలూరు జిల్లా గుడివాకలంక గ్రామానికి చెందిన గంటశాల శ్రీలక్ష్మి (18) విస్సన్నపేట నూజివీడు రోడ్డులోని రాణి ఫంక్షన్ హాల్ సమీపంలో స్కూటీపై వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొంది. ఆ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను విజయవాడ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. గుడివాడలంక నుంచి స్కూటీపై అదే గ్రామానికి చెందిన గంటశాల ఇందూ, జల్లురి గాయత్రిలతో కలిసి తిరువూరులో జరిగే ఈవెంట్‌లో పని చేసేందుకు వెళుతుండగా విస్సన్నపేట నుంచి నూజివీడు వైపు చెక్క లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఎదురుగా వచ్చి ఢీ కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.రామకృష్ణ తెలిపారు.

తూర్పుయడవల్లిలో బైక్ దగ్ధం



కామవరపుకోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తూర్పుయడవల్లి గ్రామంలో గురువారం రాత్రి కొణతం స్వామికి చెందిన మోటార్ సైకిల్ తెల్లవారేసరికి దగ్ధమైంది. అదేవిధంగా గ్రామంలో ముక్కు కృపరాజుకు చెందిన హోండా బైక్ అదృశ్యమైంది. దీంతో బాధితులు శుక్రవారం తడికలపూడి పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలానికి విచ్చేసి వారు దర్యాప్తును ప్రారంభించారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

జీలుగుమిల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పొగాకు బ్యారన్ శుక్రవారం రాత్రి దగ్ధమైంది. గ్రామానికి చెందిన వంటిపల్లి శ్రీను బ్యారన్‌ను పి.రాజవరంకు చెందిన పొంద్రు అప్పన కౌలుకు తీసుకున్నాడు. బ్యారన్‌లో పొగాకు బయటకు తెస్తున్న క్రమంలో ప్రమాద వశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పక్కనే ఉన్న మరో బ్యారన్ సీలింగ్ కాలిపోయింది. సుమారు రూ.3లక్షలు నష్టం వాటిల్లినట్లు కౌలు రైతు అప్పన్న చెప్పాడు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటల్ని అదుపు చేశారు.

మారు తండ్రిపై పోక్సో కేసు

ఏలూరు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన మహిళ భర్త మరణించడంతో కాకినాడకు చెందిన పి వంశీ మోహన్‌కుమార్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. అప్పటికే ఆమెకు ఒక కుమార్తె ఉంది. ప్రస్తుతం ఆ కుమార్తెకు ఆరు సంవత్సరాల వయస్సు. వంశీమోహన్‌కుమార్ ఆ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో తల్లి ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

బకాయిల చెల్లింపు ఆదేశాలపై హర్షం

ఏలూరురూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వంలో ఉద్యోగులకు ఉన్న బకాయిలను విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇవ్వడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని, పాత బకాయిలు, డీఏలు, ఐఆర్ సమస్యలు పరిష్కారంకావని చర్చించుకుంటున్న సమయంలో ప్రభుత్వం ఉద్యోగులకు తీపి కబురు అందించిందన్నారు. ఆర్థిక బకాయిలు 6 వేల 200 కోట్లు చెల్లింపుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్టు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు

ఏలూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు, బధిరులకు టచ్ ఫోన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ వి.రామ్‌కుమార్ తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం, ఆపైన ఐటిఐ, పాలిటెక్నిక్‌లో చదువుతూ ప్రతీరోజూ కళాశాలకు వెళ్ళి విద్యను అభ్యసిస్తున్న శారీరక, బధిర, అంధ విద్యార్థినీ విద్యార్థులకు అందించేందుకు ల్యాప్‌టాప్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. కుటుంబ ఆదాయం మూడు లక్షల్లోపు ఉండాలని, వైకల్యం 40 శాతం ఉన్న వారు అర్హులన్నారు. అలాగే బధిర విభిన్న ప్రతిభావంతులకు టచ్ ఫోన్‌ను పొందేందుకు ఇంటర్ ఉత్తీర్ణులై 18 ఏళ్ళు వయస్సు ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. మరింత సమాచారానికి విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలోని వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని ఆన్‌లైన్ షీట్‌ను ఇతర ధృవపత్రాలతో కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారానికి 08812-234146 నెంబర్‌లో కార్యాలయ పని దినాల్లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మెగాస్టార్‌కు పురస్కారంపై హర్షం

ఏలూరురూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మెగాస్టార్ చిరంజీవికి యూకె పార్లమెంటు నుంచి జీవిత సాఫల్య పురస్కారం అందుకోవడం పట్ల ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు హర్షం ప్రకటించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల భారత ప్రభుత్వం పద్మ భూషణ్‌ను అందచేసిందని తమకెంతో సంతోషంగా ఉందని అన్నారు.

జాలిపూడిలో అపరాల కేంద్రం ప్రారంభం

ఏలూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అపరాల రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఏలూరు రూరల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నంబూరి నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు మోటపల్లి పవన్ అన్నారు. జాలిపూడి సొసైటీలో శుక్రవారం పెసలు, మినుము కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పంటను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ రబీలో 2 వేల 286 ఎకరాల్లో పెసర, 370 ఎకరాల్లో మినుము పంటలను సాగు చేశారని మండల వ్యవసాయ శాఖాధికారిణి జీవన సంధ్య పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా అపరాలను కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నందిగం రమేష్, చుక్కా వెంకటేశ్వరరావు, తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు వాసవీ జాగృతి జయభేరి

ఏలూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 23వ తేదీన ఏలూరులో వాసవీ జాగృతి జయభేరి ఐకాన్ 2025ను వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఫౌండర్ అధ్యక్షులు తిరువీధి వేణుగోపాల్ తెలిపారు. ఏలూరులోని హోటల్ ఆదిత్య ప్రిన్స్‌లో వేడుక జరగనుందని, ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ తదితరులు హాజరుకానున్నారని తెలిపారు.

సారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

కొయ్యలగూడెం, మార్చి21 (ఆంధ్రజ్యోతి):సారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలని ఎక్సైజ్ శాఖ సీఐ వీర్రబ్రహ్మం కోరారు. మంగపేట, కన్నాపురం, బోడిగూడెం, దిప్పకాయలపాడు తదితర గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఫారెస్టు అధికారులకు సత్కారం

జంగారెడ్డిగూడెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా స్థానిక జియో హాత్ వే సిటీకేబుల్ కార్యాలయంలో శుక్రవారం అటవీశాఖ అధికారులను సిటీకేబుల్ ఎండి హరీష్ గుప్తా ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. ఫారెస్ట్ డీఆర్వో ధర్మారావు, ఎంఎస్ఆర్ మూర్తి, శ్రీ మన్నారాయణ, ప్రభాకరరావును సత్కరించారు.

'పది' స్పాట్ విధుల నుంచి మినహాయించాలని వినతి

ఏలూరు అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి స్పాట్ వాల్యూయేషన్ విధులనుంచి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపునివ్వాలని అభ్యర్థిస్తూ శుక్రవారం డీఈవో వెంకటలక్ష్మమ్మకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ నాయకులు వెంకటరమణారావు, బి.రాము, తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు.

వైభవంగా పల్లాలమ్మ జాతర



నిడమర్రు మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఛానమిల్లి గ్రామదేవత పల్లాలమ్మ వార్షిక జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి మంగళస్నానం, కలశస్థాపన అనంతరం అఖండ జ్యోతి ప్రజ్వలన సామూహిక కుంకమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నాదస్వరం, గరగనృత్యాలు, తీన్‌మార్ డప్పులతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నిర్మాణాలు రెగ్యులర్‌కు అవకాశం

కామవరపుకోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా గతంలో ప్రభుత్వ, ప్రైవేటు భూము ల్లో నిర్మించుకున్న భవనాలు, కట్టడాలను రెగ్యులర్ చేసే వెసులుబాటును ప్రభుత్వం కలుగ చేసిందని కామవరపుకోట తహసీల్దార్ గెడ్డం ఎలీషా తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నిధులు వసూలు చేయడం జరుగుతుందని, కట్టడాలు నిర్మించుకున్న వారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని, కేవలం రెండు నెలల్లోనే వారి దరఖాస్తులపై సమగ్ర విచారణ నిర్వహించి రెగ్యులర్ చేస్తారని తెలిపారు.

డిగ్రీ కాలేజీలో ప్రపంచ కవితా దినోత్సవం

కామవరపుకోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక పరివర్తనకు కవితలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. తెలుగు అధ్యాపకులు జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, దారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రతిపాదనలు



మాట్లాడుతున్న తహసీల్దార్ గెడ్డం ఎలీషా

కామవరపుకోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు ప్రతిపాదనలు పంపించాలని కామవరపుకోట ఎంపీడీవో ఎం.సరళ కుమారి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జడ్పీటీసీ కడిమి రమేష్, వైస్ ఎంపీపీ గిరిజారాణిలతోపాటు పలువురు ఎంపీటీసీలు, పలు శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొని తన శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలను తెలియచేశారు. మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్. సత్యవేణి, అగ్రికల్చర్ ఏవో డాక్టర్ సి.పవన్‌కుమార్, ఎంఈవో డి.సుబ్బారావు పాల్గొన్నారు.

చర్చిని తొలగించాలని ఫిర్యాదు

ఉంగుటూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు భీమేశ్వరాలయానికి చెందిన భూమిని 27 సంవత్సరాల క్రితం సర్వే నెం1130లో ఎ.4-00 సెంట్లలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఇచ్చారని స్థానికులు పేర్కొన్నారు. ఈ స్థలాల్లో ఒక వ్యక్తి తన నివాస స్థలంలో చర్చి నిర్మించి అన్యమత ప్రచారం చేస్తున్నారని, తక్షణం చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

నేడు పెదపాడు మండల సమావేశం

పెదపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పెదపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో అమీలు జమ తెలిపారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, చేపట్టబోయే అభివృద్ధి పనులతో పాటుగా సమస్యలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొవాలని కోరారు.

12 మందిపై బైండోవర్

కుక్కునూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలంలో సారా అమ్మకాలు, తయారీ కేసుల్లో పట్టుబడిన 12 మందిని శుక్రవారం కుక్కునూరు తహసీల్దార్ రమేష్‌బాబు ఎదుట ఎక్సైజ్ శాఖ సిబ్బంది హాజరుపరిచారు. దాదాపు రూ.లక్ష అపరాధ రుసుము వేశారు. ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు, ఎక్సైజ్ ఎస్సై జి.వెంకటలక్ష్మి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బీటీ రహదారి పనులు ప్రారంభం

కుక్కునూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు, భద్రాచలం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి బీటీ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నాలుగు నెలలుగా ఈ రహదారి పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ప్రజలు ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రహదారి పనులు ప్రారంభం కావడంతో ప్రజల ఇబ్బందులు తొలగినట్లు అయ్యింది.

అన్న క్యాంటీన్ భోజనం పరిశీలన



ఆహారాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ భానుప్రతాప్

ఏలూరు టూటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్ల ద్వారా పేదప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భానుప్రతాప్ అన్నారు. ఇండోర్‌స్టేడియం వద్ద అన్న క్యాంటీన్‌ను శుక్రవారం పరిశీలించారు. అక్కడ సిబ్బందిని భోజనాల గురించి ఆరా తీశారు. రుచికరంగా భోజనాలు ఉన్నాయో లేవో స్వయంగా రుచిచూశారు. మూడుపూటల రూ.15చెల్లిస్తే భోజనం , అల్పాహారాన్ని పెడతామన్నారు.

సమస్యలపై వినతుల స్వీకరణ



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగంలో నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలు సంబంధిత అధికారులతో మాట్లాడారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశిఒచారు. అనంతరం చంటి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు.

కారుణ్య నియామక పత్రం అందజేత

ఏలూరుసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాయంలో అంగలూరి సునీతకు కారుణ్య నియామకం కింద నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సబార్డినేట్‌గా నియామక ఉత్తర్వులను శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛైర్‌పర్సన్ గా తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు 64 మంది కారుణ్య నియామకాలు ఇచ్చామని చెప్పారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా సుధాకర్

జంగారెడ్డిగూడెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా తాటికొండ సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రస్తుత పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు తెలిపారు. రోటరీ కమ్యూనిటీ హాలులో శుక్రవారం బీజేపీ నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ కన్వీనర్ ఒంటెద్దు యేసు వర ప్రసాద్, నాయకులు మురళి పాలొన్నారు.

45 ఆటోలపై కేసుల నమోదు

ఏలూరు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో గురువారం రవాణాశాఖ వాహనతనిఖీ అధికారులు రమేష్‌బాబు, జగదీష్ వారి సిబ్బందితో శుక్రవారం ఆకస్మికంగా ఆటోలను తనిఖీ చేశారు. మొత్తం 45కిపై ఆటోల్లో లౌడ్‌స్పీకర్‌లు, ఎల్ఈడీ ఫోకస్ లైట్లను తొలగించారు. కేసులు నమోదు చేశారు.


ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులు, డీసీ చైర్మన్‌లతో సమీక్షిస్తున్న ఎస్ఈ మోహనరావు

త్వరలో కాల్వలకు తాగునీరు విడుదల : ఎస్ఈ

కైకలూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి నివారణకు త్వరలో కాల్వలకు నీరు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఎస్ఈ ఆర్.మోహనరావు తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలోని పలు పంట కాల్వలను, డ్రెయిన్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం కైకలూరు ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులు, డీసీ చైర్మన్‌లతో సమీక్ష నిర్వహించారు. కైకలూరు మండలంలో పల్లెవాడ నుంచి ఆలపాడు వెళ్లే పంటకాల్వ పుల్లవా డ్రెయిన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి నివారణకు కాల్వలకు నీరు విడుదల చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అన్ని మంచినీటి చెరువులను నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాల్వలు కట్టివేసిన తర్వాత ప్రతిపాదనలు చేసిన షట్టర్ల మరమ్మతులు, కాల్వ గట్లను పటిష్టం చేయడం వంటి పనులను నిర్వహించాలని సూచించారు. ఆయనతోపాటు కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, కృష్ణా డివిజన్ ఈఈ ఆంజనేయప్రసాద్, డీసీ చైర్మన్లు పొత్తూరి వాసురాజు, ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, సురేష్, డీఈ శిరీష, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ పరీక్షకు పలువురి గైర్హాజరు

ముదినేపల్లి/కలిదిండి/కైకలూరు/చాట్రాయి మార్చి 21(ఆంధ్రజ్యోతి):ముదినేపల్లి మండలంలో శుక్రవారం పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు 99.36 శాతం విద్యార్థులు హాజరయ్యారు. నాలుగు పరీక్షా కేంద్రాల్లో 621 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 617 మంది హాజరయ్యారని ఎంఈవో కె.నరేష్ కుమార్ తెలిపారు. ముదినేపల్లిలోని సహాయమాత ఇంగ్లీష్ మీడియం హైస్కూలు పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం ప్రత్యేక స్క్వాడ్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఏలూరు ఎంఈవో డి.వి. రమణ నేతృత్వంలోని ఈ బృందం క్షుణ్ణంగా తనిఖీలు చేసింది. కలిదిండి మండలంలో కోరుకొల్లు, కలిదిండి, ఆరుతెగలపాడు, భాస్కరావుపేట జడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లీష్ పరీక్షకు 10 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 833 మంది విద్యార్థులకు 823 మంది హాజరయ్యారన్నారు. సమస్యాత్మక కోరుకొల్లు జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రం వద్ద ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కైకలూరు మండలంలో ఇంగ్లీషు పరీక్షకు 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో రామారావు తెలిపారు. మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో 951 మంది విద్యార్థులకు 941 మంది హాజరయ్యారన్నారు. చాట్రాయిలో శుక్రవారం టెన్త్ ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 278 మందికి 277 మంది, ఆర్సీఎం స్కూల్ పరీక్షా కేంద్రంలో 158 మందికి 153 మంది విద్యార్థులు హాజరైయ్యారని ఎంఈవో బ్రహ్మాచారి తెలిపారు.

గేట్ ర్యాంకర్ సాయి చరణ్‌కు సత్కారం


సాయిచరణ్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కలిదిండి, మార్చి 21(ఆంధ్రజ్యోతి):ఆల్ ఇండియా గేట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 9వ ర్యాంకు సాధించిన ఆరుతెగలపాడు గ్రామానికి చెందిన చిలుకూరి సాయిచరణ్‌ను పలు ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, టీచర్స్ ఘనంగా సత్కరించారు. కష్టంతో కాకుండా ఇష్టపడి చదివినప్పుడే ర్యాంకులు సాధిస్తారన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, కాళ్లపాలెం సర్పంచ్ పేటేటి స్వర్ణకుమారి సాయిచరణ్‌కు అభినందనలు తెలిపారు.

కొల్లేటికోటలో అన్న సమారాధన



కైకలూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి):కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయంలో జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా భక్తులకు అన్న సమారాధన శుక్రవారం నిర్వహించారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడు వేల మంది భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలను నిర్వహించారు.


ముదినేపల్లి - గుడివాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న దళితులు

మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో


ఆటోలో చక్రవర్తి మృతదేహం

ముదినేపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెనుమల్లి వద్ద శుక్రవారం మినప నూర్పిళ్ల పనులకు వెళ్లి కోతమిషన్ కిందపడి మృతి చెందిన సంకర్షణపురం దళితవాడకు చెందిన ముత్యాల చక్రవర్తి(32) కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు జాతీయ రహదారిపై నాలుగు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. ముదినేపల్లి - గుడివాడ జాతీయ రహదారిపై కలవపూడి అగ్రహారం సమీపంలో దళితవాడకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో బైఠాయించారు. శుక్రవారం ఉదయం పెనుమల్లి వద్ద చక్రవర్తిపై ప్రమాదవశాత్తు మినపకోత మిషన్ బోల్తాపడింది. తీవ్ర గాయాలతో కొన ఊపిరితో ఉన్న అతడిని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే చక్రవర్తి మరణించాడు. ఆసుపత్రి నుంచి ముదినేపల్లి పోలీసులకు సమాచారం రాగా కానిస్టేబుల్ ఒకరు గుడివాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యుల వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం మృతదేహాన్ని సంకర్షణపురం తీసుకువస్తుండగా కలవపూడి అగ్రహారం సమీపంలో ముదినేపల్లి పోలీసులు సాయంత్రం 5 గంటలకు వారిని నిలిపివేసి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని వెనుక్కు తీసుకువెళ్లాలని చెప్పడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడే మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. మండవల్లి ఎస్ఐ రామకృష్ణ, ఇతర సిబ్బంది వారితో చర్చించినా ఫలితం లేకపోయింది. పోలీసుల తీరును నిరసిస్తూ మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేశారు. ముదినేపల్లి- గుడివాడ రోడ్డులో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కాగా శుక్రవారం రాత్రి 10 గంటల తర్వాత రాస్తారోకో విరమించారు.

పోతనపల్లిలో ఎక్సైజ్ దాడులు

చాట్రాయి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లిలో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 1400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ధరావతు పెద్ద బాలు, భూక్యా శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకున్నట్లు, పరారైన హసవతు విజయ, భాణావతు బాలు, బెల్లం వ్యాపారి వజ్రపు రాంబాబుపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు అజయ్ కుమార్, పాండు రంగారావు చెప్పారు. దాడులలో నూజివీడు, కైకలూరు, ఏలూరు ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది, ఈఎస్‌టిఎఫ్, ఎన్ఫోర్స్‌మెంట్, చాట్రాయి పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువతి మృతి

విస్సన్నపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విస్సన్నపేటలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఏలూరు జిల్లా గుడివాకలంక గ్రామానికి చెందిన యువతి ఘంటశాల శ్రీలక్ష్మి (18) విస్సన్నపేట నూజివీడు రోడ్డులోని రాణి ఫంక్షన్ హాల్ సమీపంలో స్కూటీపై వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొంది. ఆ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను విజయవాడ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. గుడివాకలంక నుంచి స్కూటీపై అదే గ్రామానికి చెందిన ఘంటశాల ఇందూ, జల్లూరి గాయత్రిలతో కలిసి తిరువూరులో జరిగే ఈవెంట్‌లో పని చేసేందుకు వెళుతుండగా విస్స న్నపేట నుంచి నూజివీడు వైపు చెక్క లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఎదురుగా వచ్చి ఢీకొంది. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో విజయవాడకు తరలించారు. శ్రీలక్ష్మి చికిత్స పొందుతూ మృతి చెందగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.రామకృష్ణ తెలిపారు.

చంద్రన్న స్వయం ఉపాధి రుణాలకు నేడే ఆఖరు

కైకలూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి):చంద్రన్న-స్వయం ఉపాధి పథకాల కోసం రుణాల దరఖాస్తులు ముగింపు గడువు శనివారంతో పూర్తి అవుతుందని ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వెనుకబడిన కులాలు, ఓసీ, బీసీ కులాలు అర్హత కల్గిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. లబ్ధిదారులు సచివాలయాలు, మీసేవ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్

కలిదిండి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన 'ఉప్పుటేరు తీర గ్రామాల్లో తాగునీటికి పాట్లు' కథనానికి అధికారులు స్పందించారు. ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ నిధులు సుమారు రూ.6 వేల కోట్లతో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నియోజకవర్గాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. దీనిలో భాగంగా కైకలూరు నియోజకవర్గంలో ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి మండలాల్లో నాలుగు ఓవర్ హెడ్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి చుట్టు పక్కల గ్రామాలకు పైపులైన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరుని సరఫరా చేస్తామన్నారు. జిల్లాకు శివారు ఉన్న ఉప్పుటేరు తీర గ్రామాలకు ప్రత్యే క పైపులైన్లు ఏర్పాటు చేసి శాశ్వత తాగునీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుం టామన్నారు. విజయవాడలో ప్రకాశం బ్యారేజీ వద్ద ఉన్న కృష్ణానది నుంచి నేరుగా పైపులైన్ ఏర్పాటు చేసి ఎనిమిది నియోజకవర్గాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు ఏర్పాటులో భాగంగా కైకలూరు నియోజకవర్గంలో 13 ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. త్వరలో ఈ పథకం అమలు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధాన్యం సేకరణకు చర్యలు

ఏవో వేణుమాధవ్

ముదినేపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణకు చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయాధికారి వేణుమాధవ్ తెలిపారు. 'ఖరీఫ్ ధాన్యం అమ్మేదెలా' అనే శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు స్పందించిన వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు కొనుగోలు చేయాల్సిన ధాన్యం వివరాలను పంపాలని ఆదేశించారు. దీనిపై ఏవో జిల్లా అధికారులకు వివరాలు పంపారు. మండలంలోని 676 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో జరుగుతాయని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు.


వైవాకలో భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

వైవాక భూముల పరిశీలన

ముదినేపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వైవాక రెవెన్యూ విలేజ్ ఏరియాలో ప్రభుత్వం దళితులకు పంపిణీ చేసి పట్టాలు ఇచ్చిన భూములు ఆక్రమణలకు గురయ్యాయన్న ఫిర్యాదులపై శుక్రవారం రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించారు. తమకు గతంలో ప్రభుత్వం 94 ఎకరాల బంజరు భూములను పట్టాలతో సహా స్వాధీనం చేశారని, కొంతమంది రైతులు ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని ఇటీవల ఆ గ్రామ దళితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజశేఖర్ ఆ భూములను పరిశీలించారు. సుమారు 60 ఎకరాల భూములు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. తమకు గతంలో పట్టాలిచ్చిన భూములను పెదతుమ్మడి, జయపురం, బండ్లగూడెం, వైవాక గ్రామాలకు చెందిన ఏడుగురు రైతులు సుమారు 30 ఎకరాలు ఆక్రమించుకోవడంతో భూములను సాగు చేసుకునేందుకు దళితులకు అవకాశం లేకుండాపోయిందని లబ్ధిదారు జోషి అధికారులకు తెలిపారు. భూములకు సంబంధించిన పట్టాలను అందజేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ రాజశేఖర్ తెలిపారు. వీఆర్వో నాగరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

తహసీల్దార్ రామకృష్ణ

కలిదిండి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల వైద్యాధికారులు, ప్రైవేట్ డాక్టర్లుతో సమావేశం నిర్వహించారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గర్భిణులకు లింగనిర్ధారణ పరీక్షల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు జాహ్నవి, దీరజ్, హేమంత్, నర్సీస్, ఎస్ఐ వెంకటేశ్వరరావు, ప్రైవేటు డాక్టర్లు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

ముసునూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పేదల నివాస స్థలాలకు ప్రభుత్వం పట్టాలను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పేదలతో కలిసి సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. రాజు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గత 20ఏళ్ళుగా పేదలు నివాసముంటున్నారని, ప్రభుత్వాలు మారుతున్న నేటికి పట్టాలు ఇవ్వలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం అర్హులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతపత్రాన్ని తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు అందజేశారు. మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

సునీత విలియమ్స్ విజయగాథపై అవగాహన

ముసునూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అంతరిక్ష వ్యోమగామి సునీత విలియమ్స్ విజయగాథపై శుక్రవారం రమణక్కపేట జడ్పీ పాఠశాల విద్యార్థులకు అవగహన సదస్సు నిర్వహించారు. తొలుత విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా జాతీయ జెండా స్టిక్కర్లను పట్టుకుని, సునీత విలియమ్స్‌కు అభినందనలు తెలిపారు. హెచ్ఎం పీవీఎస్.రామకృష్ణారావు మాటా డుతూ సునీత విలియమ్స్ ధైర్య సాహసాలను బాల బాలికలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సైన్స్ టీచర్ సుజాత, ఉపాధ్యాయులు షాలిని, ప్రియదర్శిని, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఇవ్వాలి

చాట్రాయి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి సర్వర్‌లో సాంకేతిక సమస్యలు సరిదిద్ది అర్హులందరి జమ చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆదిమూలం నాగ మోహన శర్మ, నెక్కలపు వెంకటేశ్వరరావు తదితరులు శుక్రవారం ఏవో శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. మర్లపాలెంలో కొంత మంది రైతులకు సమ్మాన్ నిధి జమ కాలేదని, సమస్య గుర్తించి అన్నదాతలకు న్యాయం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలన చేసి అర్హత ఉంటే తప్పనిసరిగా సొమ్ము జమ అయ్యేటట్లు చూస్తామని ఏవో శివశంకర్ హామీ ఇచ్చారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475


రహదారి అభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పార్థసారథి

పవిత్ర శిలువగట్టు అభివృద్ధికి చర్యలు

నూజివీడు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పవిత్ర శిలువగట్టు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నూజివీడు పట్టణంలో శిలువగట్టు రహదారిని కోటి 71 లక్షల రూపాయలతో సీసీ రహదారిగా అభివృద్ధి చేయనున్నారు. పనులకు శుక్రవారం మంత్రి శంకుస్థాపన చేశారు. క్రైస్తవుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉన్న శిలువగట్టును మరింత అభివృద్ధిపరిచేందుకు చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు నాగరాజు, రఘు, నత్తా నాగేశ్వరరావు, ఇళయరాజా తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నూజివీడుటౌన్ : వైద్య ఖర్చులు భరించలేని పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం అని మంత్రి పార్థసారథి అన్నారు. నియోజకవర్గంలో 83 మంది లబ్ధిదారులకు రూ.47.14లక్షల చెక్కులను శుక్రవారం అందజేశారు. ఆయన మాటాడుతూ నిరుపేదల అభివృద్ధి లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మూడు నెలలుగా ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్న పేదలు బిల్లులతో సంప్రదిస్తే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం పొందే అవకాశం ఉందన్నారు. టీడీపీ నూజివీడు, ముసునూరు మండలాల అధ్యక్షులు ముసునూరి రాజా, దేవినేని డేలారామ్, తదితరులు పాల్గొన్నారు.


కైకలూరులో చలివేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్ ఇబ్రహీం

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు

కైకలూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రహదారుల వెంబడి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం తెలిపారు. కైకలూరు తాలుకా సెంటర్లో జాతీయ రహదారి పక్కన ప్రభుత్వం తరపున శుక్రవారం చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పక్షులకు, పశువులకు నీటితొట్టెలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులకు ఉచితంగా మంచినీటిని అందించాలన్న ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఏర్పాటుచేశామన్నారు. మండల సర్వేయర్ రమేష్, ఆర్ఐ బి వెంకటేశ్వరరావు, వీఆర్వోలు బాబి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి తహసీల్దార్ కార్యాలయంలో..

చాట్రాయి : తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తాగునీటి చలివేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ గీత ప్రారంభించారు. టీడీపీ నాయకులు మందపాటి బసవారెడ్డి, పలగాని దుర్గారావు, సర్వేయర్ ప్రేమ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూములపై హక్కులు కోరుతూ రైతుల పాదయాత్ర

నూజివీడు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వేంపాడు అగ్రహార భూముల సాగుదారులకు ప్రభుత్వం హక్కులు కల్పించాలని కోరుతూ గొల్లపల్లిలో శుక్రవారం పాదయాత్ర చేపట్టి రఘునాథ స్వామికి వినతిపత్రం అందజేశారు. కౌలు చెల్లించాలని దేవదాయ అధికారులు నిత్యం రైతు దోనేటి శివాజీకి గుర్తు చేయడంతో నిరసన పాదయాత్ర ప్రారంభించారు. పలువురు నాయకులు సంఘీభావం తెలిపి పాదయాత్ర నిర్వహించారు. సీపీఐ నేత నిమ్మగడ్డ నరసింహం మాట్లాడుతూ ఐదు గ్రామాలలో 1350 మంది వేంపాడు రైతులకు ఇబ్బందిగా ఉన్న జీవో 79, 102 రద్దుచేసి సాగుదారులకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రి పార్థసారథి జోక్యం చేసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. రైతులు గోగినేని రఘు, ఒరుగు శ్రీరంగం, గోళ్ల రాజు, పొట్లూరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


చంద్రరావు (ఫైల్)

ముసునూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లబోయినపల్లికి చెందిన అనగాని చంద్రరావు (50) కనిపించడం లేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. చంద్రయ్య గత ఏడాది పినకడిమిలో ఏడు ఎకరాలు భూమిని కౌలుకు తీసుకుని పుచ్చ, బెండ, ఆనపకాయల సాగుచేయగా నష్టాలతో అప్పుపాలయ్యాడు. అప్పుల వారి నుంచి ఒత్తిడి ఎక్కువైఇది. ఈ క్రమంలో ఈ నెల 19న చంద్రరావు బైక్ వేసుకుని ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. అచూకీ లేకపోవడంతో చంద్రరావు కుమారుడు నాగకేశవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.


వడాలిలో మృతుడి కుటుంబానికి సాయం అందిస్తున్న ఏపీటీడీసీ డైరెక్టర్ వినోద్

మృతుడి కుటుంబానికి టీడీపీ సాయం

ముదినేపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలిలో ఇటీవల మరణించిన మాదే శేఖర్ కుటుంబానికి ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ ఆర్థిక సాయమందించారు. శుక్రవారం టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావుతో కలసి వినోద్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి బొర్రా బాలసాయి ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.10 వేలు అందించారు. మండల టీడీపీ ఉపాధ్యక్షుడు యర్రా రాంబాబు, జనసేన నాయకుడు బాసినశెట్టి కిషోర్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

రాత్రిళ్లు గస్తీ పెంచుతాం


వి.ఎస్.వీరభద్రరావు, ఎస్ఐ, ముదినేపల్లి

- **వేసవిలో దొంగతనాలు జరగకుండా తీసుకుంటున్న చర్యలు?**

ఎస్ఐ : దొంగతనాలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం. రాత్రిళ్ల గస్తీ పెంచుతాం.

- **హైవేల్లో బీట్‌లు పెంచుతారా ?**

ఎస్ఐ : జాతీయ రహదారి, స్టేట్ హైవేల్లో బీట్‌లు పెంచి వాహనాల తనిఖీలు నిర్వహిస్తాం.

- **చోరీలపై ప్రజలకు జాగ్రత్తలు ?**

ఎస్ఐ : వేసవిలో ఆరు బయట నిద్రించే విషయంలో జాగ్రత్తలు పాటించాలి. బంగారు ఆభరణాలు బ్యాంక్ లాకర్లలో పెట్టుకుంటే మంచిది. వేసవి సెలవుల్లో బయట ప్రాంతాలకు వెళ్లినవారు సమాచారం ఇస్తే ఆయా గృహాల ప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ నిర్వహిస్తాం.

- **మద్యం బెల్టుషాపుల నియంత్రణకు చర్యలు?**

ఎస్ఐ : బెల్టు షాపులను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- ముదినేపల్లి

వైభవంగా భక్తాంజనేయ ఆలయ వార్షికోత్సవం

ముసునూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లిలో భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి 108 బిందెలతో జలాభిషేకం, పంచామృతాభిషేకాలను నిర్వహించి, అలంకరణ చేశారు. ఆంజేయస్వామి, సువర్చల దేవి కల్యాణాన్ని అంకుశరావు తిరుపతిరావు, సూర్యకుమారి దంపతులు, గజపతిరావు దంపతులు నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం చేశారు.

పోతనపల్లిలో ఎస్టీ బాలికల హాస్టల్ ఏర్పాటుకు ప్రతిపాదన

చాట్రాయి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లిలో 100 పడకల ఎస్టీ బాలకల వసతి గృహం ఏర్పాటుకు రూ.2.75 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎంఈవో పీఎస్‌వీ బ్రహ్మాచారి చెప్పారు. మండల పరిషత్ ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎంఈవో మాట్లాడుతూ గిరిజన బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం వసతి గృహం ఏర్పాటు చేస్తుందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్నందున వడదెబ్బకు గురి కాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏవో శివశంకర్ మాట్లాడుతూ రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఉద్యానశాఖ అధికారి ఆర్.హేమ మాట్లాడుతూ మండలంలో 330 మంది రైతులకు 600 హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోట లు పెంచుకోవటానికి ప్రభుత్వం ఉచితంగా మొక్కలు, 50 శాతం సబ్సిడీపై మామిడి కవర్లు ఇస్తున్నట్లు వివరించారు. సోమవరం శివారు జగన్నాధపురంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బోరు మోటారు మంజూరు చెయ్యాలని సర్పంచ్ శోభనబాబు కోరారు. జడ్పీటీసీ చెలికాని అనూష, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ గీత, ఎంపీటీసీలు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

24న మామిడి రైతు సదస్సు

నూజివీడు టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మామిడిలో ఎగుమతులు పెంచడానికి పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై రైతు సదస్సు ఈనెల 24న నిర్వహిస్తామని మామిడి పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ నూజివీడు మామిడి పరిశోధన కేంద్రంలో రైతు సదస్సు నిర్వహిస్తామన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి, శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు.